జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php
సంపుటి 15 సంచిక 294 విశాఖపట్నం బుధవారం 21 జూన్2023 8 పేజీలు వెల : 5.00

కావలెను
రాష్ట్ర వ్యాప్తంగా నూతన శకాన్ని లిఖించబోతున్న
పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి
ఆంధ్రప్రదేశ్ 175 నియోజకవర్గాల నుంచి 175 మంది వాలంటీర్స్ ని నియమిస్తుంది.
ప్రతి వాలంటీర్ కు
నెలకు Rs.25,000/-
Salary ఇవ్వబడును.
విద్యా, వయసుతో సంబంధం లేకుండా ఎవరైనా వాలంటీర్ గా చేరవచ్చు.
ఆసక్తి గలవారు మీ బయోడేటాను ఆధార్ కార్డు తో సహా
మీ ప్రాంతంలో ఉన్న పార్స్ లీడర్స్ ని సంప్రదించవచ్చు.
లేదా ఈ క్రింది నెంబర్
7660027683 కి వాట్సాప్ చేయగలరు.

## 'జగనన్న ఆణిముత్యాలు'..

### ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు పురస్కారాలిచ్చిన సిఎం జగన్



విజయవాడ : విజయవాడలో మంగళవారం నిర్వహించిన 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమంలో టెన్త్, ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సిఎం జగన్ నగదు పురస్కారాలు అందించారు. ర్యాంకర్లకు సమాన మార్కులతో ఎంతమంది ఉన్నా అందరినీ సత్కరించారు. ప్రతి ఒక్క విద్యార్థికి నగదుతో పాటు సర్టిఫికేట్, మెడల్ ను అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మాట్లాడుతూ ... మట్టి నుంచి గట్టిగా పెరిగిన ఈ మొక్కలు.. మహావృక్షాలై.. రేపు ప్రపంచానికి ఫలాలు అందించాలని కోరారు. ప్రభుత్వం గర్వంగా చెప్పుకోదగ్గ బ్రైట్ మైండ్స్.. షైనింగ్ స్టార్, ఫ్యూచర్ ఆఫ్ ఎపి మనదని అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఎపి విద్యార్థులు పోటీపడాలనేదే తమ తపన అని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు అందిస్తున్నామని సిఎం జగన్ అన్నారు. కరిక్యులమ్ కూడా మారిందన్నారు. ప్రభుత్వ బడుల్లో ఇంగ్లీష్ మీడియం, సీబీఎస్ఈ సిలబస్ అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. ప్రతి విద్యార్థికి ట్యాబులు అందిస్తున్నామన్నారు. ప్రతీ విద్యార్థికి డిగ్రీ పట్టా ఉండాలనే తాపత్రయంతోనే.. విద్యా దీవెన, విద్యా వసతి చేపట్టామన్నారు. విద్యార్థుల ఫీజుల్ని ప్రభుత్వమే భరిస్తోందని, అత్యుత్తమ కంటెంట్‌తో నాణ్యమైన విద్య అందిస్తున్నామని అన్నారు. విద్యార్థులకు టెక్నాలజీ అందించే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. విదేశాల్లో సీటు తెచ్చుకుంటే ఆ విద్యార్థికి అండగా ఉంటామన్నారు. చదువు కోసం ఎంత ఖర్చుకైనా వెనకాడబోమని, జగన్ ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

## గతంలో కంటే బలంగా...

### అమెరికా, భారత్ సంబంధాలు : ప్రధాని



న్యూఢిల్లీ : భారత్ –అమెరికా మధ్య సంబంధాలు గతంలో కంటే మరింత బలంగా, దృఢంగా అయ్యాయని ప్రధాని మోడీ పేర్కొన్నారు. నాలుగు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం మొదటి సారి మంగళవారం ప్రధాని అమెరికాకు బయలుదేరారు. ఈ సందర్భంగా అమెరికా మీడియాతో మాట్లాడారు. ఇరు దేశాల మధ్య పెరుగుతున్న రక్షణ సహకారం తమ భాగస్వామ్యానికి ఓ మూల స్తంభం కానుందని, వాణిజ్యం, సాంకేతికత సహా ఇతరరంగాలకు సహకారం పెరగనుందని అన్నారు. భారతదేశం –అమెరికా మధ్య సంబంధాలు గతంలో కంటే బలోపేతమవడంతో పాటు ఇరు దేశాల అధ్యక్షుల మధ్య అపూర్వమైన విశ్వాసం పెరిగిందని అన్నారు. భారత్ ఏదేశాన్ని భర్తీ చేయాలని కోరుకోవడం లేదని, ఈ ప్రక్రియతో ప్రపంచంలో భారతదేశం సముచిత స్థానాన్ని పొందాలనుకుంటున్నట్లు ప్రధాని పేర్కొన్నారు. భారత దేశాన్ని అభివృద్ధి చెందుతున్న దేశాల్లో భారత్‌ను సహజ నేతగా చిత్రీకరిస్తుందని, ఆ దేశాల ఆకాంక్షలను వినిపించేందుకు మార్గం కావాలని అన్నారు. బహుళ ధ్రువ ప్రపంచ క్రమంలో వాటిని మరింత విస్తృతంగా ప్రాతినిధ్యం వహించడానికి ఐరాస వంటి ప్రపంచ సంస్థలను సమగ్రంగా మార్చాలని ఆయన పిలుపునిచ్చారు. ఐరాస భద్రతా మండలిలో భారత్‌కు సభ్యత్వం కల్పించాలని ఆయన కోరుకున్నారు. ఈ పర్యటనలో అమెరికాతో సుమారు మూడు బిలియన్ డాలర్ల విలువ కలిగిన సాయుధ డ్రోన్ల కొనుగోలు ఒప్పందంపై ప్రకటన చేయనున్నారు. అమెరికాలో కాంగ్రెస్ సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి ప్రధాని రెండో ప్రసంగం చేయనున్నారు. అలాగే అక్కడి పారిశ్రామిక వేత్తలు, భారతీయ నిపుణులతో భేటీ కానున్నారు. అనంతరం అమెరికా అధ్యక్షుడు బైడెన్ వైట్‌హౌస్‌లో ఇచ్చే విందులో పాల్గొననున్నారు.

### పవన్ కల్యాణ్‌కే కాదు.. ఏపీలో ఎవ్వరికీ రక్షణ లేదు..: పురందేశ్వరి



అమరావతి: తన ప్రాణాలకు ప్రాణహాని ఉందన్న జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై బీజేపీ నాయకురాలు దగ్గుబాటి పురందేశ్వరి స్పందించారు. ఈ రాష్ట్రంలో పవన్ కల్యాణ్‌కే కాదు ఎవ్వరికీ రక్షణలేకుండా పోయిందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లిలో పర్యటించిన పురందేశ్వరి దిశ యాప్ తో పోలీసులు ఎవ్వరినీ రక్షించలేకపోయారని మండిపడ్డారు. ఏపీలో సాక్ష్యాత్తూ ఎంపీ కుటుంబానికే రక్షణ లేకపోతే ఇక సామాన్యుడి రక్షణ పరిస్థితేంటని విశాఖ ఎంపీ కిడ్నాప్ వ్యవహారాన్ని లేవనెత్తారు. కాగా ఇటీవల తూర్పుగోదావరి జిల్లాలో పర్యటించిన పవన్ కల్యాణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తనకు ప్రాణహాని ఉందంటూ.. తనను చంపేందుకు సుపారీ గ్యాంగులు రంగంలోకి దిగాయంటూ జనసేన అధినేత చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్‌గా మారాయి. మరోవైపు పవన్ కల్యాణ్ ప్రాణహాని వ్యాఖ్యలపై వైసీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పవన్‌కు ప్రాణహాని ఉంటే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని హితవు పలుకుతున్నారు. ఇక ఏపీలో పవన్ వర్సెస్ వైసీపీ నేతల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. ఓవైపు పవన్ వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తుంటే దీనికి ప్రతిస్పందనగా వైసీపీ నేతలు కూడా తీవ్ర స్థాయిలోనే కౌంటర్లు ఇస్తున్నారు.

### ఐఎఎస్ అధికారులతో ఢిల్లీ పాలనను అడ్డుకుంటున్న కేంద్రం : కేజ్రీవాల్




న్యూఢిల్లీ : మోడీ ప్రభుత్వం ఐఎఎస్ అధికారులతో ఢిల్లీ పాలనను నియంత్రించాలని భావిస్తోందని ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ విమర్శించారు. కేంద్రం తీసుకువచ్చిన ఆర్డినెన్స్‌పై సుప్రీంకోర్టును ఆశ్రయించనున్నట్లు ప్రకటించారు. మంగళవారం నేషనల్ క్యాపిటల్ సివిల్ సర్వీసెస్ అథారిటీ (ఎన్‌సిసిఎస్‌ఎ) మొదటి సమావేశానికి హాజరైన ఆయన అనంతరం మీడియాతో మాట్లాడారు. మోడీ ప్రభుత్వం ఆర్డినెన్స్ ద్వారా ఎన్నికైన ప్రభుత్వ అధికారాలను లాక్కుందని అన్నారు. మండిపడ్డారు. మంత్రులకు బదులుగా అధికారులకు బాధ్యతలను కట్టబెట్టిందని, ఆర్డినెన్స్ ఢిల్లీ చీఫ్ సెక్రటరీని కేంద్రం కన్నా ఉన్నత స్థానంలో ఉంచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రులు తీసుకున్న నిర్ణయాలను తోసిపుచ్చే అధికారం ఐఎఎస్‌లకు ఉందని అన్నారు. ఎన్‌సిసిఎస్‌ఎ సమావేశానికి కొద్ది రోజుల ముందు ఓ అధికారి సస్పెన్షన్‌కు సంబంధించిన ఫైల్ తనకు అందిందని కేజ్రీవాల్ పేర్కొన్నారు. కొన్ని ప్రశ్నలు లేవనెత్తడంతో ఆ ఫైల్ తిరిగి తన దగ్గరకు రాకుండా.. లెఫ్టినెంట్ గవర్నర్ కార్యాలయానికి వెళ్లిందని .. ఎన్‌సిసిఎస్‌ఎకి చెందిన ఇద్దరు సభ్యులు ఆమోదించడంతో ఆ అధికారి సస్పెండ్ అయ్యారని అన్నారు. త్వరలో ఆర్డినెన్స్‌తో పాటు ఈ అంశాలన్నింటినీ సుప్రీంకోర్టు దృష్టికి తీసుకువెళ్లనున్నామని అన్నారు.

### ఇటలీకి భారీ సంఖ్యలో వలసదారులు



రోమ్ : గతవారం చివర్లో శని, ఆదివారాల్లో ఇటాలియన్ భూభాగానికి వలసదారులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. వీరంతా ఆఫ్రికాలోని ఉత్తర తీరాలకు దగ్గరగా ఉన్న ఇటాలియన్ భూభాగమైన లాంపెడుసా ద్వీపంలోని రిసెప్షన్ సెంటర్‌కి పడవల ద్వారా దాదాపు 1300 మంది చేరుకున్నారు. అయితే ఇటలీ భూభాగానికి చేరుకునే వలసదారుల్ని నౌకాశ్రయ అధికారులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దాదాపు 12 పడవల్లో 691 మంది ఉన్న వలసదారులను నౌకాశ్రయ అధికారులు అడ్డుకున్నారు. ఈ పడవల్లోని ఉన్న వారంతా లిబియాలోని జువారా, ట్యునీషియాలోని స్ఫాక్స్ నుండి బయలుదేరినవారని అధికారులు సోమవారం వెల్లడించారు. అయితే ఇటలీకి చేరుకున్న వలసదారులను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఇటలీ ప్రధానమంత్రి జార్జియా మెలోని కూడా వలసదారులు దిగడానికి ఓడరేవులను కేటాయించాలని అధికారులను ఆదేశించారు.

జై భీమ్


రిజర్వేషన్స్ కావాలా....?
జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కావాలా....?
ఆలోచించండి!
➤ 1951 లో ఇండియా జనాభ 37 కోట్లు
➤ 2021 ఇండియా జనాభా 139 కోట్లు
➤ 2016 లెక్కల ప్రకారం నేషనల్ శాంపిల్ సర్వే (NSSO ) వారు కులాల జనాభా నిష్పతి
BC 41% ,SC 20%, ST 9%, OC 30%
➤ ప్రస్తుతం అనుభవిస్తున్న రిజర్వేషన్స్
BC 27%, SC15.5%, ST 7.5%, OC 50%
ఆలోచించండి!
రిజర్వేషన్ కావాలా? రిప్రజెంటేషన్ కావాలా?
జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్స్ కావాలని ప్రతిపాదిస్తుంది
పూలే అంబెడ్కర్ రాజ్యాధికార సమితి

## రెండు పార్టీల నేతలు 'చలో గిద్దలూరు'

### కాపు కాచేది ఎవరో.. సీటు దక్కించుకునేదెవరో..




అమరావతి: ఏపీలో టీడీపీ–జనసేన పొత్తు ఖాయమని సంకేతాలొస్తున్న వేళ ప్రకాశంజిల్లాలో జనసేన నేతలంతా ఆ సీటుపైనే గురిపెట్టారు. జిల్లాలో మిగిలిన నియోజకవర్గాలకంటే గిద్దలూరే అందరికీ ది బెస్ట్‌గా కనిపిస్తోందట. టీడీపీ పొత్తులో ఆ సీటు తెచ్చుకోగలిగితే గెలుపు నల్లేరుమీద బండి నడకేనన్న భావనతో ఉన్నాయట జనసేన పార్టీ శ్రేణులు. ఎందుకంటే జిల్లాలోనే కాపు ఓటర్లు ఎక్కువగా ఉంది గిద్దలూరులోనే. అంతే కాకుండా 2009లో ప్రజారాజ్యానికి పట్టంకట్టారు ఇక్కడి ఓటర్లు. అందుకే జనసేన టికెట్ రేసులో ఉన్న ముఖ్య నేతలంతా చలో గిద్దలూరు అంటున్నారు. 2009లో ప్రకాశంజిల్లాలోని 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్క గిద్దలూరులోనే ప్రజారాజ్యం నుంచి అన్నా రాంబాబు గెలిచారు. కాపు ఓటర్లు కలిసిరావటంతో కాంగ్రెస్ అభ్యర్థిపై 7వేల పైచిలుకు ఓట్ల మెజారిటీతో గెలిచారాయన. ఇప్పుడు గిద్దలూరు సీటుపై జనసేన గురిపెట్టడానికి ఇది కూడా ప్రధాన కారణమంటున్నారు. ఆ సామాజికవర్గంనుంచి సీటు ఆశిస్తున్న నేతలు.. గిద్దలూరు అయితే గన్‌షాట్‌గా గెలవొచ్చనుకుంటున్నారు. చీరాల కాపు సంఘం నేత, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ అన్న ఆమంచి స్వాములు గిద్దలూరు సీటుపై కర్చీఫ్ వేశారట. ఇటీవల జనసేనలో చేరేందుకు ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌ని కలిసిన ఆమంచి స్వాములు.. పార్టీలో చేరి కార్యకర్తలా పనిచేస్తానని చెప్పారట. తర్వాత పార్టీ వ్యవహారాలు చూసే పెద్దలకు మాత్రం గిద్దలూరు కేటాయిస్తే గెలిచి చూపిస్తానని చెప్పారట. దీంతో ఆమంచి స్వాములుతో పాటు మరికొందరు నేతలు గిద్దలూరులో ఛాన్స్‌కోసం పార్టీ పెద్దలదగ్గర మంతనాలు మొదలుపెట్టారు. పొత్తుకుదిరితే ప్రకాశంజిల్లాలో జనసేన పక్కాగా అడిగే సీటు గిద్దలూరే. అందులో నోడౌట్. అదే సమయంలో గిద్దలూరు సీటు జనసేనకిస్తే ఇప్పటికే ఇక్కడ టీడీపీ అభ్యర్థిగా ప్రచారం చేసుకుంటూ స్పీడ్‌పెంచిన మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పరిస్థితి ఏంటన్నదానిపై ఇప్పుడు చర్చ నడుస్తోంది.

# ఆపన్న హస్తం కోరుతున్న చదువుల తల్లులు....



గుంటూరు (ప్రజాపాలన ప్రతినిధి):విద్యా సరస్వతులు తాము చదువు కోవడం కోసం ఆర్థిక సహాయం కోరుతున్నారు.గుంటూరు జిల్లాకు చెందిన ముద్దు బాలస్వామి ముగ్గురు కుమార్తెలు చదువులో ప్రతిభ కనబర్చుతున్నప్పటికి బాలస్వామి ఆరోగ్యం బాగాలేక ఫీజులు చెల్లించలేని పరిస్థితి ఉండడం తో ఆయన ఆర్థిక సహాయాన్ని కోరుతున్నారు.ఈ సందర్భంగా ఆయన దాతలకు విజ్ఞప్తి చేస్తూ తమ పిల్లలు డిగ్రీ ఆఖరి సెమిస్టర్ పరీక్షలు ఈ నెలలో జరుగనున్నాయని,ఈ సంవత్సరం తన పరిస్థితి బాగా లేక కాలేజి ఫీజులు చెల్లించ లేకపోయానన్నారు.రెండవ అమ్మాయి బి ఎస్ సి (మ్యాథ్స్) పూర్తి చేసి ఎం ఎస్ సి లో జాయిన్ అవుతున్నట్లు,మూడవ అమ్మాయి బీకామ్ పూర్తి చేసి లా సెట్ ద్వారా న్యాయవాద కోర్సు లో జాయిన్ అవుతున్నట్లు,ఇద్దరికి కలిపి 66000 ఫీజు చెల్లించాల్సి ఉన్నట్లు ఆయన తెలిపారు.ఈ నెలలోనే పరీక్షలు వున్నవని,దయచేసి పెద్ద మనసు తో తమ పిల్లల చదువులకు సహాయం చేయగలరని దాతలకు విజ్ఞప్తి చేశారు.కాలేజి అడ్రస్..ఫాదర్.ముద్దు బాలస్వామి...కాలేజి కరస్పాండెంట్. ఫోన్:9502354845...మార్నింగ్ స్టార్ కాలేజి,ఫిరంగిపురం,గుంటూరు జిల్లా..దాతలు తమ దాతృత్వాన్ని చూపి దయచేసి ఆడపిల్లలకు సహాయ సహాయం చేయగలరని పిల్లి.రాజు విజ్ఞప్తి చేశారు.

**పిల్లి రాజు బహుజన నాయకుడు వారి పిల్లల చదువుల నిమిత్తం ఆర్థిక సహాయం చేయమని కోరగా స్నేహ సంస్థ ప్రతినిధి మరియు మాస్టర్ కి టీవీ కంటెంట్ ఓనర్ నేరేళ్ల కోటేశ్వరరావు స్పందించి వారి పిల్లల చదువుల నిమిత్తం ఐదు వేల రూపాయలు ఆర్థిక సహాయమును ,వారి స్నేహితుల ద్వారా బేతాళ సుదర్శన్ రావు 10,000 ,రెడ్డి మల్ల పార్వతి 1000/ రూపాయలు మొత్తం 16 వేల రూపాయలు పిల్లి రాజు పిల్లలు ఇరువురికి సహాయం చేశారు. నేరెళ్ళ కోటేశ్వరరావు అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నందుకు వారికి పిల్లి రాజు కృతజ్ఞతలు తెలియజేశారు.**

# అర్బీఐ డిప్యూటీ గవర్నర్‌గా ఎస్‌బీఐ ఎండీ స్వామినాథన్

న్యూఢిల్లీ: స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ స్వామినాథన్ జానకిరామన్ ను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ గవర్నర్‌గా కేంద్రం మంగళవారంనాడు నియమించింది. బాధ్యతలు చేపట్టిన నుంచి మూడేళ్ల పాటు లేదా తదితర ఉత్వర్వులు వెలువడేంత వరకూ ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్ మహేష్ కుమార్ జైన్ పదవీకాలం మంగళవారం ముగియడంతో కేంద్రం ఈ నియామకాన్ని చేపట్టింది. ఆర్బీఐ గవర్నర్‌కు నెలకు రూ.2.5 లక్షల వేతనం, అలవెన్సులు లభిస్తాయి.ప్రస్తుతం ఆర్బీఐ గవర్నర్‌గా శక్తికాంత్ దాస్ ఉండగా, డిప్యూటీ గవర్నర్లుగా మైఖేల్ పాత్ర, ఎం.రాజేశ్వరరావు, టి.రవిశంకర్ ఉన్నారు. డిప్యూటీ గవర్నర్ల పదవీకాలం మూడేళ్లు ఉంటుంది. రీఎపాయింట్‌మెంట్‌కు కూడా అవకాశం ఉంటుంది.

# మాతృభూమి పై మమకారం.. సేవా కార్యక్రమాలలో ఎన్నారై



చీరాల, జూన్ 20, ప్రజాపాలన : తొమ్మిది ఏళ్ల తర్వాత, మాతృ దేశానికి వచ్చిన, చీరాల మండ లం జాండ్రపేట వాస్తవ్యులు, ఎన్నారై బట్ట తులసి శ్రీనివాసరావు తన స్వగ్రామంలో గంగా భ్రమరాంబ సమేత నాగలింగేశ్వర స్వామి ఆలయంలో, బట్ట మోహన రావు, పుష్పవల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, మంగళవారం జరిగిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ బట్ట మోహన రావు మాట్లాడుతూ, రిటైర్డ్ ఆర్మీ పర్సన్ బట్ట శంకరరావు పెద్ద కుమారుడు బట్ట తులసి శ్రీనివాసరావు, వారి కుటుంబ సభ్యులందరూ, అమె రికాలో నివాసం ఉన్నా, మాతృభూమిపై మమకారంతో, మాతృభూమికి వచ్చి, సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం, అభినందనీయమన్నారు. వారు చేసిన మంచి పనులే, భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా, నిలుస్తాయని అభివర్ణించారు. ఈ సందర్భంగా 60 మందికి, అన్న దాన కార్యక్రమాన్ని నిర్వహించి, స్వయంగా ఎన్నారై, వారి కుటుంబ సభ్యులు వడ్డన చేయటం అభినందనీయం. కార్యక్రమంలో ట్రస్ట్ మేనేజర్ గుత్తి పరంజ్యోతి, సభ్యులు సీతారామయ్య, మకరరావు తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణజిల్లాలో ఈ నెల 23న కేంద్రమంత్రి భారతీప్రవీణ్‌పవర్ పర్యాటనను విజయవంతం చేయండి: బిజెపి జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ



గుడివాడ : కేంద్ర మంత్రి డా।। భారతీప్రవీణ్‌పవర్ కృష్ణ జిల్లాలో ఈ నెల 23వ తేదిన మెవ్వలోని దేవలయంలో పూజలు నిర్వహించి మొపిదేవిలోని పలుచోట పర్యాటించి అవినిగండలో బహిరంగ సభలో పాల్గొటారని బిజెపి జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు తెలిపారు. మంగళవారం బిజెపి కార్యలయంలో ఏర్పాటు చేసిన విలేకర్లు సమావేశంలో అయన మాట్లాడుతూ ఈ నెల 22వ తేది మచీలీపట్నంలో రాత్రికి కేంద్రమంత్రి డాక్టర్ భారతీప్రవీణ్‌పవర్ బసచేస్తారన్నారు. 23వ తేదిన ఆవినిగడ్డలో జరిగే బహిరంగ సభలో పాల్గొటారన్నారు. ఈ సభలో గుడివాడకు సంభందించిన టిడ్కో గృహల విషయంలో 1600మంది లబ్ధిదారుల తొలగింపు విషయంపై ఫిర్యాద్ చేయడం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్మించిన టిడ్కో గృహలు విషయంలో గుడివాడ ప్రజలను మోసం చేయడం జరగిందన్నారు. మౌళిక వసుతులు లేకుండా గృహలు పంపిణి చేయడం మోసం కాదన్నారు. ముఖ్యమంత్రి ప్రారంభించినప్పుటికి ఎందుకు టిడ్కో ఇల్లు లబ్ధిదారులకు తాళాలు ఇవ్వలేదన్నారు. వెంటనే లబ్ధిదారులకు గృహల తాళాలు ఇవ్వకపోతే పోరాటం చేస్తామన్నారు. 23న జరిగే కేంద్రమంత్ర పర్యాటనను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అంగడాల సతీష్, జిల్లా నాయకులు వల్లపర్ల వెంటకటేశ్వరావు.పట్టణా, రూరల్ మండలల అధ్యక్షులు యర్రబోతు అర్జున్, శీలం శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

# పవర్ లిఫ్టర్స్‌లో రాష్ట్రస్థాయి విజేతలుగా స్టేడియం కీడ్రాకారులు - స్టేడియం కమిటి ఉపాధ్యక్షుడు పాలేటి



గుడివాడ : ఇటివల గుంటూరు జిల్లా తెనాలిలో జరిగిన 10వ రాష్ట్రస్థాయి క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ పోటిలలో స్టేడియం జిమ్‌కు చెందిన ఇరువురు మహిళా పవర్ లిఫ్టర్లు పాల్గొని విజయం సాధించడం అభినందనీయమాని ఎన్‌టిఆర్ కమిటి ఉపాధ్యక్షుడు పాలేటి చంటి, సంయుక్తా కార్యదర్శి పర్వతనేని ఆనంద్‌లు అన్నారు. మంగళవారం స్థానిక ఎన్‌టిఆర్ స్టేడియంలో 47 కేజీల శరీర బరువు విభాగంలో 172,5 కేజీల బరువునెత్తి ఎన్.వీరనాగఅను బంగారు పతకం, 73కేజీల విభాగంలో కొండపల్లి మాణిక్యాలరావు 265 కేజీల బరువునెత్తి కాంస్య పతకం, ఎన్.వీరనాగఅను వెండి పతకం, గుదే సుభాషిణి వెండి పతకం, గుదే సుభాషిణి కాంస్య పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు బోగ్గవరపు తిరపతయ్య, కోచ్ మారెళ్ళ వెంకటేశ్వరరావు, మేనేజర్ సత్యనారయణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవన్ని సద్వినియోగం చేసుకోండి

ఈ నెల 21వ తేది బుధవారం ఉదయం 6గం।।లకు అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఎన్‌టిఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు కమిటి ఉపాధ్యక్షుడు పాలేటి చంటి, సంయుక్తా కార్యదర్శి పర్వతనేని ఆనంద్‌లు తెలిపారు. ఈ కార్యక్రమానికి పట్టణంలోని స్వంచ్చంద సేవా సంస్థలు, కీడ్రాకారులు, ఉపాధ్యాయులు కళాశాల విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో సభ్యులు బోగ్గవరపు తరపతయ్య, కోచ్ మారెళ్ళ వెంకటేశ్వరరావు, స్టేడియం మేనేజర్ సత్యనారయణ, తదితరులు పాల్గొన్నారు.

# బాపట్ల నియోజకవర్గంలో అట్టహాసంగా ప్రారంభమైన చైతన్య రథయాత్ర



చీరాల /పర్చూరు, జూన్ 20, ప్రజాపాలన : వైసీపీ ప్రభుత్వ వైఖరితో విసిగి, వేసారిపోయిన రాష్ట్రప్రజలకు భవిష్యత్ పై భరోసా కల్పిస్తూ, ఇటీవల తెలుగుదేశం పార్టీ మహానాడులో ప్రకటించిన, భవిష్యత్ కు గ్యారెంటీ మినీ మ్యానిఫెస్టో ను, ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చైతన్య రథయాత్ర బస్ యాత్ర బాపట్ల నియోజకవర్గంలో అట్టహాసంగా ప్రారంభించారు. ముందుగా పార్టీ కార్యాలయానికి చేరుకున్న, తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీనియర్ నాయకులు, భవిష్యత్తుకు గ్యారెంటీ బస్ లో, బాపట్ల పట్టణములోని శ్రీ భావన్నారాయణ స్వామి దేవాలయం నందు, ప్రత్యేక పూజలు నిర్వహించి, చైతన్య రథంయాత్రను ప్రారంభించారు. అనంత రం జమ్ముల పాలెం ఫ్లై ఓవర్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి, పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. తదనంతరం బాపట్ల నియోజక వర్గ పార్టీ కార్యాలయంలో,నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో, భవిష్యత్తుకు గ్యారెంటీ మినీ మ్యానిఫెస్టో మీద, చర్చా కార్య క్రమం నిర్వహించారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత, అమలు చేయబోయే ప్రజా సంక్షేమ పథకాలను, విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి, వారిని పార్టీకి మరింత చేరువ చేసే విధంగా, ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా బాధ్యత తీసుకోవాలని, తెలుగుదేశం శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు.కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ మాజీమంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, దేవినేని ఉమామహేశ్వరరావు, ఆలపాటి రాజా, నక్కా ఆనందబాబు,పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల.రామయ్య, బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు ఏలూరి.సాంబశివరావు, ఎమ్మెల్యేలు అనగాని సత్య ప్రసాద్, మాజీ ఎంపీ లు శ్రీరామ్ మాల్యాద్రి, కొనకళ్ల నారాయణ, ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ, మాజీ ఎమ్మెల్యే లు జీ.వి. ఆంజనేయులు, ఇన్‌ఛార్జ్ లు వేగేశన నరేంద్రవర్మ, యం.యం.కొండయ్య, జూలకంటి బ్రహ్మానంద రెడ్డి, శ్రావణ్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి సలగల రాజశేఖర్, జే పీ గౌడ్, రాష్ట్ర స్థాయి సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సెయింట్ ఆన్స్ లో విజయవంతంగా ముగిసిన ఎ.పి.ఇ సెట్ -2023 పరీక్షలు





చీరాల, జూన్ 20, ప్రజాపాలన : సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజి, చీరాలలో ఎ.పి ఇంజినీరింగ్ కామన్ ఎం ట్రన్స్ టెస్ట్ (ఎ.పి.ఇసెట్ -2023)పరీక్షలు మంగళవారం విజయవంతంగా ముగిసినట్లు, కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కర స్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు లు సంయుక్తంగా తెలియజేశారు.పాలిటెక్నిక్ నుండి నేరుగా బి.టెక్ రెండవ సంవత్సరంలో చేరుటకు, ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హైయర్ ఎడ్యు కేషన్ వారి ఆధ్వర్వంలో, జె.యన్.టి.యు, కాకినాడ వారి పర్యవేక్షణలో, నిర్వహిస్తున్న ఇంజ నీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ -2023, కళాశాలలోని టి.సి.యస్ ఐయాన్ సెంటర్ నందు, మంగళవారం విజయవంతంగా ముగిసినట్లు, కళాశాల ప్రధానోధ్యాపకులు డా.మొయిద వేణుగోపాలరావు తెలిపారు. మొదటి షిఫ్ట నందు, 170మందికి గాను 156 మంది, సాయంత్రం షిఫ్ట నందు 271మందికి గాను 256 మంది, మొత్తం 441మందికి గాను, 412 మంది హాజరైనట్లు తెలిపారు. ఈ పరీక్షలకు డాక్టర్ జి.కళా ధర్ పరిశీలకులుగా విచ్చేశారు.

# పెండ్యాల గ్రామ అభివృద్ధికి అనువణువునా అడ్డుప డేది వైసీపీ: ఎంపీపీ ఏ సర్పంచ్ మల్లిక భాను

కంచికచర్ల జూన్ 19 ప్రజాపాలన ప్రతినిధి. పెండ్యాల గ్రామం అభివృద్ధికి నోచుకో పోపటం కేవలం అధికార పార్టీకి చెందిన ఎంపీపీ మాలిక్ బషీర్ ఏ కారణమని గ్రామ సర్పంచ్ మల్లిక భాను మంగళవారం ప్రకటన ద్వారా ఆవేదన వ్యక్తం చేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రమంతా వైసిపి పాలన నడుస్తున్న పెండ్యాల గ్రామంలో టిడిపి మహిళ సర్పంచ్ నైన న న్ను ఎన్నో అవమానాలకు గురిచేస్తూ కనీసం ప్రోటో కాల్ కూడా పాటించకుండా ఒంటెద్దు పోకడ పోతుంది మీరు కాదా, ఒక్కసారి ఆలోచించుకోండి. గ్రామపంచా యతీ అభివృద్ధి కోసం ఆహోర్నిశలు శ్రమిస్తున్న కనీసం పంచాయతీ పన్నులు వసూలు చేయటానికి కూడా గ్రామ సెక్రెటరీని పన్నుల వసూళ్లకు సహకరించకుండా చేసింది ఎవరో మీకు తెలియదా పంచాయతీలో నిధు లు లేకుండా పంచాయతీ పన్నులు వసూలు చేయ కుండా అడ్డు పడ్డది మీరు కాదా, పంచాయితీ సిబ్బం దికి జీతభత్యాలకు ఇంతవరకు టెండరు పిలవకుం డా నిలిపినది ఎవరు టెండర్లకు పిలవకుండా పంచాయితీ సిబ్బందికి జీతాలు రాన్వికుండా చేసింది మీరు కాదా అని నేను ప్రశ్నిస్తున్నాను. అధికారం ఉంది కదా అని పంచాయతీ అధికారులను మీ చెప్పు చేతల్లో పెట్టుకుని మీరు చెప్పిందే జరగాలని కనీసం గ్రామ ప్ర థమ పౌరుడు సర్పంచికీ తెలియకుండా మీ అధికార బలాన్ని ఉపయోగించి గ్రామాన్ని అభివృద్ధికి నోచుకో కుండా చేసింది మీరు కాదని ప్రశ్నించారు. గ్రామంలో సర్పంచ్ అనుమతి మరియు తీర్మాణాలపై సర్పంచ్ సంతకాల లేకుండా గ్రామంలో రూ. 36 లక్షలకు సం బంధించి పనులు ఏలా చేశారు. అప్పుడు గుర్తుకు రా లేదా గ్రామానికి సర్పంచ్ ఉన్నారని, గ్రామ సర్పంచ్ అనుమతి లేకుండా ఎన్ని తీర్మానాలు చేశారు. పం చాయతీ పరిధిలో జాతీయ ఉపాధి హామీ పనులకు పంచాయతీ సర్పంచ్ అనుమతి లేకుండా తీర్మానాలు చేసి పంచాయతీ సర్పంచ్ సంతకాలు లేకుండా ప ను లు నడుపుతుంది మీరు కాదా. మీరు అధికారం చేప ట్టి ఎన్ని రోజులు. . అవుతుందో మీకు తెలియదేమో కనీసం పెండ్యాల గ్రామంలో నడిబొడ్డున ఉన్న పంచా యతీ కార్యాలయాన్ని పూర్తి చేయడం చేతగాని మీ రు, గ్రామాన్ని అభివృద్ధి పరచటానికి ఆటంకులు ఎదు ర్కొంటున్నామని చెప్పటం శోచనీయంగా ఉంది. గ్రా మంలో ఎంపీ నిధులతో వాటర్ ట్యాంక్ మరియు సీసీ రోడ్లు రూ.30 లక్షలతో అభివృద్ధి పనులు చేసేంది మీ కు కనపడటంలేదా మరి మీరు ఎంపీపీగా ఉండిగ్రామ అభివృద్ధికి ఎందుకు అడ్డుపడుతున్నారన్నారుగత పది నెలల క్రితమే సొంత ఎంపీపీ గ్రామంలో పంచా యతీ కార్యాలయం పూర్తి చేసుకోలేకపోయారనే వార్త వచ్చినా ఈరోజుకి నీకు ఎటువంటి స్పందన లేకపోవ డం శోచనీయం. అర్ధాంతరంగా తమరికి గ్రామంలో అభివృద్ధి గురించి గుర్తుకు రావటం హాస్యాస్పదంగా ఉంది. ఎదుటివారి మీద బురద చల్లే మాటలు ఇ ప్పటికైనా మానుకొని గ్రామంలో అభివృద్ధి ఎలా చే యా లి ప్రోటోకాల్ ఏ విధంగా పాటించాలి అనే విష యా లు తెలుసుకుని మాట్లాడితే సమంజసంగా ఉంటుం ద న్నారు.

# కేకేఎం 24వ వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా విద్యాశాఖ అధికారి పి జె వి రామారావు





బాపట్ల, ప్రజాపాలన ప్రతినిధి: స్నేహ గ్రూప్ ఆఫ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలోని కే.కే.యం.24వ వార్షికోత్సవ సందర్భంగా బాపట్లలో జరుగు వేడుకలకు బాపట్ల జిల్లా విద్యాశాఖ అధికారి పి.జే .వి రామారావు గారిని ముఖ్యఅతిథిగా ఆహ్వానించుట జరిగినది. గత 23 సంవత్సరాలు నుండి కేకేయం సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలను వివరంగా తెలియజేసి ప్రధానంగా ,"పుస్తకం లేదని చదువు ఆగుకూడదని "మంచి సంకల్పంతో స్నేహ గ్రూప్ ఆఫ్ ఆర్గనైజేషన్ చైర్మన్ డాక్టర్ కటికల శివభాగ్య రావు గారి చేస్తున్న సేవలను వివరించి పై వార్షికోత్సవ కార్యక్రమానికి వచ్చే విధంగా ప్రయత్నం చేయుట జరిగినది. జిల్లా విద్యాశాఖ అధికారిని ఈ సందర్భంగా స్నేహ క్లబ్ తరఫున శాలువా పూలదండతో ఘనంగా సన్మానించడం జరిగినది. పై కార్యక్రమంలో పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు ఉప్పాల మురళి గౌడ్ ,స్నేహ క్లబ్ అధ్యక్షులు కాగిత సుందరదాస్ ,పార్ట్స్ క్రీడా విభాగం అధ్యక్షులు డాక్టర్ కాగిత వరప్రసాద్ ,స్నేహ కార్యదర్శి సంజయ్ మాస్టర్ గురజాల శ్రీనివాసరావు ,మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## కన్నాతో సత్తెనపల్లి నియోజకవర్గ అభివృద్ధి సాధ్యం



సత్తెనపల్లి ప్రజాపాలన ప్రతినిధి: వైసిపి పై పోరాడేందుకు టిడిపి శ్రేణుల ప్రత్యేక సమావేశంలి : సత్తెనపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ మాజీ మంత్రివర్యులు కన్నా లక్ష్మీ నారాయణ గారిని సత్తెనపల్లి నియోజకవర్గానికి చెందిన నేతలు మర్యాదపూర్వకంగా కలిసి ముత్యాల హారం, కిరీటం,దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. వైసిపి అరాచకాలతో సత్తెనపల్లి నియోజకవర్గ ప్రజలు విసుగెత్తిపోయారని అభివృద్ధి లేక నియోజకవర్గ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని.కన్నా లక్ష్మీ నారాయణ గారి రాకతో సత్తెనపల్లి అభివృద్ధి చెందుతుందని నియోజకవర్గ ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారన్నారు.కన్నా లక్ష్మీ నారాయణ గారు వైసిపి అరాచకాలపై చేసే పోరాటంలో ముందుకు సాగుతామని చేశారు.నియోజకవర్గంలో వైసిపి అవినీతి అరాచకాలపై ప్రజా సమస్యలపై ప్రత్యేక భేటీ అయ్యారు.

## మొండితోక జగన్ మోహన్ రావుని మర్యాదపూర్వకంగా కలిసిన అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ పి శ్రీనివాస్



నందిగామ జూన్ 20 ప్రజాపాలన ప్రతినిధి:నూతనంగా బదిలీపై వచ్చిన అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ పి శ్రీనివాస్ మైనర్ ఇరిగేషన్ స్పెషల్ సెక్షన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా బాధ్యతలు స్వీకరించినపిగంగయ్య ఎమ్మెల్యేని అయన కార్యాలయంలో మర్యాద పూ ర్వ కంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేసిన ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను



జగ్గయ్యపేట జూన్ 20 ప్రజాపాలన ప్రతినిధి:మండలపరిధిలో షేర్ మహమ్మద్ పేట గ్రామానికి చెందిన గా దే సురేష్ క ు వా ె అంతుచిక్కని వ్యాధితో బాధప డుతున్న విషయాన్ని ప్రభుత్వవిప్ సామినేని ఉదయ భాను ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి దృష్టి కి తీసుకువెళ్లడంతో వెంటనే స్పందించి వారి కుమా ర్తెకు వైద్య ఖర్చుల నిమిత్తం మూడు లక్షల రూపాయ ల ఆర్థిక సహాయాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరు చేయడం జరిగింది.ఆ చెక్కును లబ్ధిదారునికి ప్రభుత్వవిప్, సామినేని ఉదయభానుఅందించారుఅదేవిధంగా పట్టణంలో సీతారామపురం యాదవ్ బజార్ కు చెందిన భయ్యా లింగ బాబుకు మార్తెలైన భయ్యా సుప్రియ,భయ్యా హరిప్రియ వీరిద్ద రికీ పుట్టుకతో చెవుడు కారణంగా కాంక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ ద్వారా ఆ ఇద్దరు పిల్లలకు మెరుగైన వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ముందస్తు వైద్య ఖర్చుల నిమిత్తం ఒక్కొక్కరికి 2 లక్షల 60 వేల రూపాయల చొప్పున ఇద్దరు పిల్లలకు 5 లక్షల 20వేల రూపాయల మంజూరు పత్రాన్ని లబ్ధిదారునికి అందిం చారు.

## స్పందన కార్యక్రమానికి వచ్చే వారికి అన్నదాన కార్యక్రమం నిర్వహించడం సంతోషికరం: ప్రవళిక సత్యం



పల్నాడు జిల్లా నరసరావుపేట జూన్ 20 (ప్రజాపాలన ప్రతినిధి): మానవతా దృక్పథంతో ఎస్పీ ఆఫీసుకు స్పందన కార్యక్రమానికి వచ్చేవారికి అన్నదాన కార్యక్రమం నిర్వహించడం సంతోషి కరంగా ఉందని ప్రముఖ వ్యాపారవేత్త ప్రవళిక సత్యం అన్నారు. ప్రతి సోమవారం ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాలతో ఎస్పీ రవిశంకర్ రెడ్డి సహాయ సహకారాలతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఈ సందర్భంగా మీడియా సమావేశంలో... ప్రవళిక సత్యం మాట్లాడుతూ ... పల్నాడు జిల్లా...కేంద్రమైన నరసరావుపేట పట్టణంలో పల్నాడు జిల్లా ఎస్పీ కార్యాలయం నందు స్పందన కార్యక్రమం విచ్చేయు అర్జీదారులకి గత 11 వారాలగా అన్నదాన కార్యక్రమం కి మన శాసన సభ్యులు గోపి రెడ్డి శ్రీనివాస రెడ్డి ఆదేశాల మేరకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం స్పాన్సర్: పొత్తూరి నాగేశ్వరరావు , ముఖ్య అతిథులుగా ఎన్ కె ఆంజనేయులు మరియు బొగ్గరపు బ్రహ్మానందం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా. పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్ రెడ్డి , అడిషనల్ ఎస్పీ రాజు , చేతుల మీదుగా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు .అన్నదాన కార్యక్రమంనికి ఆర్గనైజర్స్ ప్రవళిక సత్యం, మధు లైటింగ్స్ మధు ,చిన్ని టెలికం కమ్యూనికేషన్స్ అధినేత చిన్ని శ్రీనివాసరావు నిర్వహిస్తున్నారు.ప్రతి సోమవారం స్పందన కార్యక్రమంలో సుమారు 250 మంది అర్జీదారులకి ఉచిత అన్నదానం నిర్వహిస్తున్నామని ప్రవళిక సత్యం తెలియజేశారు.

## రాష్ట్రంలో గంజాయి సంస్కృతి పోతేనే ఆడబిడ్డలకు రక్షణ

**పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు జీవి ఆంజనేయులు**



పల్నాడు జిల్లా. నరసరావుపేట. జూన్ 20 (ప్రజా పాలన ప్రతినిధి)రాష్ట్రంలో గంజాయి సంస్కృతి పోతేనే ఆడబిడ్డలకు రక్షణ జరుగుతుందని పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు.పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం లో జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జీవి ఆంజనేయులు మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జీవి మాట్లాడుతూ గంజాయిని అరికట్టేందుకు ఉక్కు సంకల్పంతో కృషి చేస్తాం అని, రాష్ట్రంలో గంజాయి తాగే వెధవల్ని తయారు చేసి, వారు చేసే నేరాలను సమర్థించే ముఖ్యమంత్రిని ఏమనాలి?గంజాయి తాగే వెధవలకు తల్లి చెల్లి తేడా తెలియద ని అన్నారు.గంజాయి తాగే వెధవలను రోడ్ల మీదకు వదిలేస్తారా..?అధికార పార్టీ ఎంపీ ఫ్యామ్లీనే కిడ్నాప్ చేశారు.విశాఖలో అక్రమాలకు భయపడి ఎంపీ ఎంవీవీ తన ఆఫీసును హైదరాబాదుకు మార్చుకున్నారు.ఏపీలో ఉండలేమని అధికార పార్టీ ఎంపీనే హైదరాబాదుకు వెళ్లిపోయారు.ఏపీలో గన్ చూపించి ఆస్తులు రాయించుకునే పరిస్థితి ఉంది.ఏపీలో విచ్చలవిడి గంజాయి వినియోగం యువత భవిష్యత్తుని నాశనం చేయడమే కాదు, ఏకంగా ప్రాణాలను కూడా తీస్తోంది.వాడవాడలా విస్తరిస్తున్న గంజాయిపై ఇంత ఉదాసీనత ఎందుకు? ఒకసారి గంజాయికి అలవాటు పడిన వారి జీవితం ఎంత ప్రమాదంలోకి వెళ్తుందో అధికారులు అర్థం చేసుకోరా? ఈ ఉదాసీనత వల్ల గంజాయి మహమ్మారి మన బిడ్డల వరకు వస్తుంది అని మర్చిపోకండి అని అన్నారు.తెలుగుదేశం అధికారంలోకి రాగానే పక్కా ప్రణాళికతో గంజాయి సరఫరాపై ఉక్కుపాదం మోపుతాం. గంజాయి మత్తులో యువత నేరాలు చేస్తున్నారు ఇంత ఘోరాలు జరుగుతుంటే పోలీసులు ఏంచేస్తున్నారు . ఈ ప్రభుత్వాన్ని మార్చాలని అనుకోకపోతే భవిష్యత్ లేదు అని జీవి ఆంజనేయులు అన్నారు.

## మండల అధ్యక్షుడు పై దాడిని ఖండించిన టీడీపీ మండల నాయకులు



కారంపూడి... జూన్20...ప్రజాపాలన... ప్రతినిధి: మండల అధ్యక్షుడు ఉన్నం లక్ష్మీనారాయణ పై వైసీపీ నాయకులు దాడి చేయటం సిగ్గుచేటు అని టిడిపి నాయకులు పంగులూరి అంజయ్య, గోళ్ళ సురేష్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి నాయకుడు అమర్ వర్గీయులు మద్యం తాగి వాళ్ళు ఇష్టానుసారంగా రోడ్లపై గోలలు చేస్తూ సామాన్య ప్రజలపై దాడి చేస్తుంటే పోలీసులు చూస్తూ ఊరుకున్నారు అని అన్నారు. ఇప్పటికైనా పోలీసులు అధికార పార్టీకి కొమ్ము కాయకుండా సామాన్య ప్రజల వైపు ఉండి సామాన్యులకు న్యాయం జరిగేలా చేయాలని వారు అన్నారు. టిడిపి నాయకుడు పై దాడి చేసిన వారిని వెంటనే శిక్షించాలని వారి డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో , మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తీశ్వర జల ప్రసాదమును ప్రారంభించిన ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి



ప్రజాపాలన న్యూస్ శ్రీకాళహస్తి వాటర్ ప్లాంట్ ను స్విచ్ ఆన్ చేసి ప్రారంభించిన ప్రముఖ సినీ హీరో జేడీ చక్రవర్తి గారు.శ్రీకాళహస్తి దేవస్థానంకు విచ్చేసే భక్తుల సౌకర్యార్థం శుద్ధజల త్రాగునీటి ప్లాంట్లను డివిస్ లేబరేటరీస్ లిమిటెడ్ వారు నాలుగు ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చి ఎమ్మెల్యే గారిని కలిశారు. దాతలకు కావాల్సిన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ఆలయ పాలక మండలి చైర్మన్ అంజూర తారక్ శ్రీనివాసులు గారికి,%జూ% సాగర్ బాబు గారికి ఆదేశించారు.ఈ సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్లను మంగళవారం ఉదయం ఎమ్మెల్యే గారు వాటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన ప్రముఖ సినీ నటుడు జేడీ చక్రవర్తిని స్విచ్ ఆన్ చేసి ప్రారంభించవలసిందిగా ఎమ్మెల్యే గారు కోరడంతో వాటర్ ప్లాంట్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం బోర్డు సభ్యులు పసల సుమతి, మున్నా రాయల్, జయశ్యం రాయల్, చింతామణి పాండు, నందా,జులుగంటి సుబ్బారావు,భాస్కర్,లక్ష్మీపతి, కంట ఉదయ్ కుమార్,%ఎంతీ%,అట్ల రమేష్, రామచంద్ర రెడ్డి రెడ్డి పాల్గొన్నారు.

## టిడిపి మండల అధ్యక్షుడు పై వైసిపి నాయకులు దాడి



కారంపూడి.. జూన్20...ప్రజాపాలన... ప్రతినిధి :టిడిపి మండల అధ్యక్షులు ఉన్నం. లక్ష్మీనారాయణపై వైసీపీ నాయకులు మంగళవారం దాడి చేశారు. వివరాల్లోకి వెళ్తే కారంపూడి మండలం చింతపల్లి గ్రామానికి చెందిన మండల టిడిపి మండల అధ్యక్షుడు ఉన్నం లక్ష్మీనారాయణ కారంపూడి లోని టీ స్టాల్ వద్దకి టీ తాగడానికి వస్తుండంగా, వైసీపీ నాయకుడు అమర్ దాడి చేశారు అంటూ ఉన్నం లక్ష్మీనారాయణ ఆరోపించారు. దీంతో ఉన్నం లక్ష్మీనారాయణ అమర్ పై కారంపూడి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు పై దాడి జరిగిన విషయం ఉన్నం లక్ష్మీనారాయణ వర్గీయులు తెలుసుకొని పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు. దీంతో వైసిపి నాయకులు అమర్ వర్గీయులు ఎక్కడున్నాడు అని ఊన్నం లక్ష్మీనారాయణ అనుచరులు ఆరా తీయగా, వైసిపి నాయకులు అమర్ వర్గీయులు ప్రభుత్వ ఆర్ అండ్ బి బంగ్లాలో ఉన్నారన్నా విషయం తెలుసుకున్నారు. ఉన్నం లక్ష్మీనారాయణ వర్గీయులు ఆర్ అండ్ బి బంగ్లా ను చుట్టుముట్టారు. వైసీపీ నాయకుడు ఆర్ అండ్ బి బంగ్లా నుండి బయటకు రాకపోవడం తో వైసిపి నాయకుడు కారుని టీడీపీ నాయకులు కారు అద్దాలు ను ధ్వంసం చేశారు. దీంతో పోలీసులు విషయం తెలుసుకొని సంఘటనా స్థలానికి చేరుకుని ఇరు వర్గాలను చల్లచెదరు చేశారు.

## టిడిపి నేత లక్ష్మీనారాయణపై వైసీపీ నాయకుడు దాడి



కారంపూడి... జూన్20...ప్రజాపాలన... ప్రతినిధి...పట్టణంలోని మంగళవారం స్థానిక బస్టాండ్ సెంటర్లో టిడిపి మండల అధ్యక్షులు వున్నం లక్ష్మీనారాయణ ఉదయాన్నే టీ త్రాగేందుకు బస్టాండ్ కు వచ్చాడు అదే సమయంలో వైఎస్ఆర్సిపి నాయకులు అమర్ కూడా వచ్చాడు ఇద్దరి మధ్య గొడవ జరిగింది ఇంతలో అమర్ వర్గీయులు టిడిపి మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ సైదా లపై దాడి చేసినట్లు తెలిపారు. లక్ష్మీ నారాయణ పై దాడి చేశారని తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ నాయకులు పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు అన్యాయంగా తమ పార్టీ అధ్యక్షుడుపై చేసుకోవడం సరైన పద్ధతి కాదని లక్ష్మీనారాయణ వర్గీయులు పోలీస్ స్టేషన్ ముందు బేటాయించారు ఇంతలో అమర్ వర్గీయులు ఆర్ అండ్ బంగ్లాలో ఉన్నారని సమాచారంతో లక్ష్మీనారాయణ వర్గీయులు తెలుసుకున్నారు ఆర్ అండ్ బి బంగ్లా కు చేరుకొని దేశం పార్టీ నాయకులు చుట్టుముట్టారు అక్కడే ఉన్న అమర్ కు సంబంధించిన కారు అద్దాలను ధ్వంసం చేశారు సంఘటన స్థలానికి చేరుకున్న సిఐ దార్ల జయకుమార్ ఎస్ఐ రామాంజనేయులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాలను పంపించారు లిసిఐ దార్ల జయకుమార్ వివరణలి గొడవ ఎలా జరిగిందో క్షుణ్ణంగా తెలుసుకుని పరిశీలించి కేసు నమోదు చేసి వారిపై చట్టపర్యమైన చర్యలు తీసుకుంటామని ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని అన్నారు.

## నత్త నడక సాగుతున్న ఏరియా హాస్పిటల్ నిర్మాణ పనులును వేగవంతం చేయాలి



ప్రజాపాలన న్యూస్ శ్రీకాళహస్తి : జై భీమ్ ఆర్మీవ్యవస్థాపకులు పులి శ్రీకాంత్. శ్రీకాళహస్తి ఎరియా ఆసుపత్రి నిర్మాణ పనులు నత్త నడకన సాగుతున్నాయి.మంగళవారం జై భీమ్ ఆర్మీ టీం సభ్యులు శ్రీకాళహస్తి ఏరియా హాస్పిటల్ ను సందర్శించడం జరిగింది. అందులో భాగంగా నూతనంగా ఏరియా హాస్పిటల్ సూపరెండెంట్ గా పదవి బాధ్యతలు చేపట్టిన డాక్టర్ విజయలక్ష్మి గారిని కలిసి హాస్పిటల్ లో వసతుల కల్పన పై చర్చించడం జరిగింది.ఆపరేషన్ థియేటర్ లేనందువలన పేషెంట్లు పడే ఇబ్బందులను, కష్టనష్టాలను సూపర్డెంట్ దృష్టికి తీసుకు వెళ్లడం జరిగింది .అందుకు సూపరెండెంట్ గారు సానుకూలంగా స్పందించి వీలైనంత త్వరలో ఆపరేషన్ థియేటర్ ను పేషెంట్లకు అందుబాటులోకి తీసుకు వస్తామని,మెరుగైన వైద్యం పేషెంట్లకు అందిస్తామని హామీ ఇవ్వడం జరిగింది.తమ ఏరియా హాస్పిటల్ లో ఉన్న సమస్యలు ఆర్వో వాటర్ ప్లాంట్, డయాలసిస్ సెంటర్ దగ్గర డంప్ అవుతున్న మురికి నీరు గురించి, పేషెంట్లు అటెండర్ ల కోసం హాస్పిటల్ వెలుపల ప్రాంతంలో నిర్మించిన మరుగుదొడ్లను వినియోగం లోకి తీసుకు రావాలని కోరడం జరిగింది.అందుకు ఆమె సాధ్యమైనంత తొందరగా సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా జై భీమ్ ఆర్మీ వ్యవస్థాపకులు శ్రీకాంత్ గారు మాట్లాడుతూ మధ్యాహ్నం పూట అందించే భోజనాలు కూడా ప్రతిరోజు చెక్ చేయాల్సిన బాధ్యత సిబ్బంది మీద ఉందని అన్నారు.ఒకేసారి రెండు మూడు మృతదేహాలు వచ్చినప్పుడు వాటిని ఉంచడానికి ఫ్రీజర్ సదుపాయాలు కూడా మెరుగుపరచాలని కోరారు.ఈ సమస్యలన్నీ త్వరలో పరిష్కరిస్తామని సూపర్నెంట్ గారు హామీ ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో జై భీమ్ ఆర్మీ పట్టణ అధ్యక్షులు కన్నలి రమేష్ మరియు కుంపటి చలపతి, సాధు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.




జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన

## సంపాదకీయం

బుధవారం 21, జూన్ 2023

# వారం, వారం అప్పు కోసం పరుగులు!

అడ్డూఅదుపు లేకుండా వారం, వారం ఆర్బీఐ ముందు మోకరిల్లి అప్పుల కోసం బిచ్చం ఎత్తుకొంటున్నది వైసీపీ ప్రభుత్వం. దేశం మొత్తంలో ఆంధ్రప్రదేశ్ తప్ప మరే రాష్ట్రం ఈ విధంగా చేయడం లేదు. ఆర్బీఐ ముందు మోకరిల్లి సెక్యూరిటీల వేలం ద్వారా అప్పు తేనిదే వైసీపీ ప్రభుత్వానికి పూట గడిచే పరిస్థితి లేదు. ప్రతి మంగళవారం రుణం కోసం ఢిల్లీకి ఆర్థిక మంత్రి, అధికారులు పరుగులు తీస్తున్నారు. అప్పులు తేవడంలో జగన్‌రెడ్డి ప్రభుత్వం ఆల్ టైమ్ రికార్డు సృష్టించింది. ఆర్బీఐ నుంచి తెచ్చే వేల కోట్ల అప్పులే కాకుండా, కార్పొరేషన్లు, బ్యాంకుల నుంచి అప్పులు తెస్తున్నారు. విచ్చలవిడిగా అప్పులు తెస్తూ, పారదర్శకత లేని పాలనా విధానాలతో ఆంధ్రప్రదేశ్ భవిష్యత్‌ను బలిపీఠం పైకి నెడుతోంది జగన్ ప్రభుత్వం. రాష్ట్ర సొంత ఆదాయం, తెస్తున్న అప్పులు కలిపి ఏడాదికి రూ. రెండు లక్షల కోట్ల పైన వస్తోంది. మరి ఇన్ని లక్షల కోట్లు ఏమవుతున్నట్లు? ఎవరి జేబుల్లోకి వెళుతున్నట్లు? కొత్తగా ఒక్క సాగునీటి ప్రాజెక్టు నిర్మించలేదు? కొత్తగా ఒక్క ఎకరం సాగు విస్తీర్ణం కూడా పెంచలేదు. కొత్త రోడ్లు వెయ్యక పోగా, రోడ్లపై గుంతలు కూడా పూడ్చలేదు. ఒక్క ఆస్పత్రి నిర్మించలేదు. పాఠశాలలు, కళాశాలలు నిర్మించలేదు. ఐటి రంగాన్ని అభివృద్ధి చేయలేదు. ప్రతి నెలా ఉద్యోగులకు మూడో వారం వచ్చినా జీతాలు ఇచ్చే పరిస్థితి లేదు. కాంట్రాక్టర్లకు, ఇతరులకు ఇవ్వాల్సిన పెండింగ్ బిల్లులు లక్షన్నర కోట్ల వరకు ఉన్నట్లు సమాచారం. రానున్న ఎన్నికల్లో ఎలాగూ తాను అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదు కాబట్టి వచ్చే ప్రభుత్వం వడ్డీలకు, అసలు చెల్లింపులకు తప్ప మరే ఇతర పనులు చేపట్టకుండా అప్పులు చేసి వెళ్లిపోవాలని జగన్ నిర్ణయించుకున్నట్లు కనపడుతోంది. ఇప్పటికే రాష్ట్రం మొత్తం అప్పు రూ.12లక్షల కోట్లకి చేరింది. సంపద సృష్టించడం ద్వారా రాష్ట్రాభివృద్ధికి కృషి చెయ్యమంటే దానిని మహాపాపంగా భావిస్తున్నారు వైసీపీ పెద్దలు. కేంద్ర ప్రభుత్వం కూడా రాష్ట్ర ప్రభుత్వం అప్పులు తెచ్చుకోవడానికి అండగా నిలుస్తోంది. గతంలో ఎన్నడూ ఒక రాష్ట్ర ప్రభుత్వానికి అప్పులు తెచ్చుకోవడానికి కేంద్రం ఈ తరహా అనుమతి ఇవ్వలేదు. ఒక ఆర్థిక సంవత్సరంలో ఏ రాష్ట్రానికి అయినా రెండు, మూడు సార్లు మాత్రమే కొత్త అప్పులకు కేంద్రం అనుమతి ఇస్తుంది. కానీ ఆంధ్రప్రదేశ్‌కి వారం, వారం కొత్త అప్పులకు అనుమతులు ఇస్తూ తన నిబంధనలను తానే కేంద్ర ప్రభుత్వం ఉల్లంఘిస్తోంది. 2023%--%24 ఆర్థిక సంవత్సరంలో కేంద్రం రూ.30,500 కోట్ల అప్పులు చేసుకునేందుకు అనుమతినిచ్చింది. ఇందులో ఇప్పటికే ఇరవై వేల కోట్లకు పైగా అప్పులు తెచ్చేశారు. ఇంకా రూ.10,500 కోట్ల పరిమితి మాత్రమే మిగిలి ఉంది. ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన 80రోజుల లోనే జగన్ ప్రభుత్వం మొత్తం రూ.36,549 కోట్ల అప్పులు తెచ్చినట్లు సమాచారం. ఇందులో రూ.19వేల కోట్లు కేంద్రం అనుమతితో ఆర్‌బీఐ నిర్వహించే సెక్యూరిటీల వేలం ద్వారా తేగా, మిగిలిన రూ.17,549 కోట్ల అప్పులో రూ.15,735 కోట్లను పబ్లిక్ అకౌంట్ ద్వారా, మరో రూ.1814 కోట్లు కేంద్రం నుంచి వచ్చే లోన్లు లేదా నాబార్డు ద్వారా అప్పు తెచ్చినట్లు కాగ్ నివేదికలో ఉంది. ఒక్క ఏప్రిల్ నెలలోనే రూ.23,549 కోట్ల అప్పులు తెచ్చినట్టు కాగ్ తన నివేదికలో తెలిపింది. ఆర్‌బీఐలో సెక్యూరిటీల వేలం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్‌లో రూ.6వేల కోట్లు, మే నెలలో రూ.8వేల కోట్లు, జూన్ 17 నాటికి రూ.5వేల కోట్లు అప్పు తేగా, జూన్ 20న సెక్యూరిటీల వేలంలో పాల్గొని మరో రూ.వెయ్యి కోట్ల అప్పు తీసుకోనున్నట్లు ఆర్‌బీఐకి రాష్ట్ర ప్రభుత్వం ఇండెంట్ పంపింది. ఈ వెయ్యి కోట్ల అప్పుతో ఈ ఏడాది ఎఫ్ఆర్‌బిఎం పరిమితిలో రూ.20,500 కోట్లకు చేరనున్నది. పబ్లిక్ అకౌంట్ ద్వారా తెచ్చిన అప్పులకు కేంద్రం అనుమతి లేదని, ఈ అప్పులకు సంబంధించి వివరణ కోరినా, ప్రభుత్వం స్పందించడం లేదని కాగ్ నివేదిక తెలిపింది. అంతే కాదు ఆదాయం కంటే చేస్తున్న అప్పులే అధికంగా ఉన్నాయని కూడా తెలిపింది. అందుకే కాగ్ నివేదిక ప్రకారం ఏప్రిల్‌లో రెవెన్యూ లోటు భారీగా రూ.17,805 కోట్లకు చేరింది. ఏడాది మొత్తమ్మీద రెవెన్యూ లోటు రూ.22,316 కోట్లు ఉంటుందని బడ్జెట్‌లో అంచనా వేశారు. కానీ, ఆదాయానికి మించి జగన్ అప్పులు చేస్తుండడంతో ఒక్క ఏప్రిల్ నెలలోనే రెవెన్యూ లోటు రూ.17,805 కోట్లకు చేరుకోవడం ప్రమాదకరం. ఇది ఆర్థిక అరాచకత్వమే.ఆ మధ్య నీతి ఆయోగ్ సమావేశంలో ఆర్థిక వ్యవస్థ వేగంగా పురోగమించాలంటే ఆరోగ్యకరమైన పెట్టుబడుల ద్వారా మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయాలని జగన్ నీతులు వల్లించారు. మరి ఆ మేరకు రాష్ట్రంలో ఆయన చేస్తున్నది ఏమిటి? ప్రభుత్వమనేది ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. వివిధ రూపాల్లో ఎన్నెన్ని అప్పులు తెచ్చారన్న సమాచారాన్ని జగన్ ప్రభుత్వం ఏనాడూ బయటికి వెల్లడించలేదు. వైసీపీ ప్రభుత్వం నాలుగేళ్లుగా కేంద్రం, ఆర్బీఐ కళ్ళు కప్పి అప్పులు తెస్తూనే ఉంది. జగన్‌రెడ్డి ప్రభుత్వం అప్పులు తెచ్చుకునేందుకు కేంద్రం లోలోన సహకరిస్తూ పైకి మాత్రం ఉత్తుత్తి హుంకరింపులు చేస్తోంది. రాష్ట్ర అభివృద్ధికి అప్పులు అవసరమే కానీ అవి ఆస్తులు సృష్టించేందుకు ఉపయోగించాలి. కానీ ఈ నాలుగేళ్లలో రాష్ట్రంలో సృష్టించిన ఆస్తి ఒక్కటీ లేదు. అప్పులతో ప్రాజెక్టుల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పన, ఉత్పత్తి పెంపుదల చేసివుంటే సంపద సృష్టికి బీజం పడేది. వైసీపీ నాయకులు పొలిటికల్ మాఫియాగా ఆవిర్భవించి సహజ వనరులను దోపిడీ చేస్తున్నారు. సహజవనరుల ఆదాయాన్ని ప్రభుత్వ ఖజానాకు చేర్చి ఉంటే సంక్షేమం, అభివృద్ధి చెయ్యవచ్చు. కానీ ప్రభుత్వ ఆదాయం పెంచే ప్రయత్నం చెయ్యకుండా, జనాకర్షణ పథకాలతో తన వ్యక్తిగత పరపతిని జగన్ పెంచుకొంటున్నారు. అధిక పన్నులు, చార్జీల రూపంలో చివరిగా ఆ అప్పుల భారాన్ని మోయాల్సింది ప్రజలే. ఆదాయంతో సంబంధం లేకుండా విచ్చలవిడిగా అప్పులు చేస్తున్న ప్రభుత్వాలకు శ్రీలంక ఆర్థిక సంక్షోభమే ఒక హెచ్చరిక అని ఆర్థిక నిపుణులు చెబుతున్నా ప్రభుత్వం పెడచెవిన పెడుతోంది. ఇష్టారాజ్యంగా అప్పులు తెస్తూ ప్రజల కోసం ఖర్చు పెడుతున్నామని చెప్పడం పచ్చి అబద్ధం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, అప్పులపై ఆర్థికమంత్రి బుగ్గన బుకాయిస్తూ, చర్చకు సిద్ధమని చేతకాని సవాల్ విసిరారు, సవాల్ స్వీకరించి ప్రతిపక్షం చర్చకు సిద్ధపడితే ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి బయటికి రావడం లేదు. నిజంగా ధైర్యం ఉంటే అప్పులపై ముఖ్యమంత్రి చర్చకు రావాలి.తెలుగుదేశం హయాంలో పెట్టుబడులు, పరిశ్రమలు రావడంతో ఆదాయం పెరిగింది. విభజన సమస్యలు వెంటాడుతున్నప్పటికీ అయిదేళ్లలో తెలుగుదేశం ప్రభుత్వం చేసిన అప్పు రూ.1.86లక్షల కోట్లు కాగా, జగన్‌రెడ్డి నాలుగేళ్లలో రూ.8లక్షల కోట్లు అప్పు చేశారు. అయిదేళ్లలో తెలుగుదేశం సంక్షేమానికి రూ.3లక్షల కోట్లు ఖర్చు చేసింది. సాగునీటి రంగానికి రూ.67వేల కోట్లు ఖర్చు చేసి, పోలవరం పనులు 72 శాతం పూర్తి చేయడంతో పాటు, 32 సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టి, నదుల అనుసంధానానికి శ్రీకారం చుట్టింది. అమరావతిలో రూ.2లక్షల కోట్ల సంపద సృష్టించింది. కానీ జగన్‌రెడ్డి ప్రభుత్వం సంపద సృష్టించడం చేతకాక వారం, వారం ఆర్బీఐ ముందు మోకరిల్లి అప్పుల కోసం బిచ్చం ఎత్తుకొంటున్నది.మద్యం అమ్మకాలను కూడా తాకట్టు పెట్టి అప్పులు తెచ్చిన చరిత్ర జగన్‌రెడ్డిది. చెత్త పన్ను, ఆస్తి పన్నుతో పాటు విద్యుత్తు ఛార్జీలు, ఆర్టీసీ ఛార్జీలు, నిత్యావసరాల ధరలు పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నది జగన్ ప్రభుత్వం. ప్రత్యేక హోదా సాధించి పరిశ్రమలు తెచ్చి ఉద్యోగాలు కల్పిస్తానని అధికారంలోకి వచ్చి, పరిశ్రమలు తీసుకురాకపోగా, వచ్చిన పరిశ్రమలను వెళ్ళగొట్టి యువతని మోసం చేసిన ఘనుడు ఈ ముఖ్యమంత్రి. రాష్ట్రంలో విచ్చలవిడిగా, మద్యం, గంజాయి, మత్తు పదార్థాల మాఫియా చెలరేగిపోతోంది.

# ఆర్థిక వృద్ధి కోసం ఎగుమతులపై ఆధారపడితే...

రెండు ప్రపంచ యుద్ధాల నడుమ కాలంలో వచ్చిన అనుభవాలతో ఎగుమతులపై ఆధారపడి ఆర్థిక వృద్ధి సాధించాలన్న వ్యూహాన్ని చాలా దేశాలు విడిచిపెట్టాయి. నయా ఉదారవాద విధానాలు ముందుకొచ్చాక ఆ నాడు విడిచిపెట్టిన వ్యూహమే మళ్ళీ ముందుకొచ్చింది. ఇప్పుడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మరొకసారి సంక్షోభంలో చిక్కుకుంది. అందుచేత ఈ వ్యూహానికి కాలం చెల్లే సమయం దగ్గరపడింది.ఎగుమతుల మీద ఆధారపడి సాధించే ఆర్థిక వృద్ధి పైకి ఒక విజయంలా కనిపించినా, ఒక్క దెబ్బకి అదంతా మటుమాయం అయిపోయే ప్రమాదం ఉంది. ఎందుకంటే, ఆ వృద్ధి అంతా అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి దయ మీద ఆధారపడి వుంటుంది. ఆ ద్రవ్య పెట్టుబడి దురాశకే ఆ వృద్ధి కాస్తా బలైపోతుంది కూడా. ముందు శ్రీలంక, తర్వాత పాకిస్తాన్, తర్వాత తాజాగా తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న మరో పొరుగు దేశం బంగ్లాదేశ్. తాజాగా ఐఎంఎఫ్ నుండి బంగ్లాదేశ్ 450 కోట్ల డాలర్ల రుణాన్ని అర్థించింది. ఇదిగాక, ఇప్పటికే ప్రపంచ బ్యాంక్ నుండి 100 కోట్ల డాలర్లను, రుణదాతలుగా ఉండే దేశాల నుండి, ఏజన్సీల నుండి 250-300 కోట్ల డాలర్లను రుణంగా కోరుతోంది. ప్రస్తుతం బంగ్లాదేశ్ వాణిజ్య లోటు రోజురోజుకూ పెరిగిపోతోంది. విదేశీ మారక నిల్వలు తరిగిపోతున్నాయి. కరెన్సీ విలువ పడిపోతోంది. ద్రవ్యోల్బణం రికార్డు స్థాయిలో ఉంది. ఇంధన రంగంలో ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభం ఫలితంగా భారీ స్థాయిలో విద్యుత్ కోతలు అమలు జరుగుతున్నాయి. అయినప్పటికీ ప్రభుత్వం బింకంగా, పెద్ద ఇబ్బందులేమీ లేనట్టు పైకి వ్యవహరిస్తోంది. కొద్ది నెలల క్రితం వరకూ అందరూ బంగ్లాదేశ్ ఆర్థిక విజయగాథల గురించి గొప్పగా చెప్తూ వచ్చారు. ఆ ప్రచారాన్ని ప్రస్తుత పరిణామాలు పరిహసిస్తున్నాయి. స్త్రీలలో అక్షరాస్యత 73 శాతానికి చేరిందని, 1971లో పాకిస్తాన్ నుండి విడిపోయినప్పుడు ఎంత శాతం శిశు మరణాలు ఉండేవో, వాటిలో సగానికి ఇప్పుడు తగ్గిపోయాయని, మానవాభివృద్ధి సూచికలో ఇండియా కన్నా, పాకిస్తాన్, మరికొన్ని దేశాల కన్నా బంగ్లాదేశ్ ముందుందని నివేదికలు వెల్లడించాయి. ఈ అభివృద్ధి వాస్తవంగా చెప్పుకోదగ్గదే. చాలా మంది దీనిని ఒక ఆర్థిక అద్భుతంగా అభివర్ణించారు. బంగ్లాదేశ్ స్వతంత్రం సాధించిననాటికి అది చాలా బలహీనమైన ఆర్థిక వ్యవస్థగా ఉండేది. అటువంటిది తన పొరుగుదేశాల కన్నా వేగంగా అభివృద్ధి సాధించగలగడం నిజంగానే గొప్ప విషయం. అటువంటిది ఇప్పుడు ఆ దేశం ఉన్నట్టుండి ఇలా ఆర్థిక చిక్కుల్లో కూరుకుపోవడం చాలామందిని ఆశ్చర్యపరుస్తోంది. శ్రీలంక విషయంలో చెప్పినట్టుగానే, ఇక్కడ కూడా ఈ పరిస్థితికి అవినీతి పెరిగిపోవడమే కారణం అని వ్యాఖ్యానించడం జరుగుతోంది. అవినీతి ఎక్కడైనా ఖండించవలసినదే, బంగ్లాదేశ్ ప్రస్తుత పరిస్థితికి అవినీతే కారణం అని చెప్పడం తేలికే. కాని అది అసలు కారణం కాదు. మరికొందరు చెప్తున్నది ఇలా ఉంది: ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో చాలా సరుకుల అంతర్జాతీయ ధరలు పెరిగిపోయాయని, అందువలన బంగ్లాదేశ్ దిగుమతి చేసుకునే సరుకులకు చెల్లించవలసిన మొత్తం పెరిగిపోయి, అందుకవసరమైన విదేశీ మారకపు నిల్వలు కాస్తా కరిగిపోయాయని వారంటున్నారు. మరోవైపు బంగ్లాదేశ్ ఎక్కువగా తన దేశ అవసరాల కోసం దిగుమతులపై ఆధారపడుతుందని, ఇప్పుడు ఆ దిగుమతులు చేసుకునే శక్తి సన్నగిల్లడంతో దేశంలో సరుకుల ధరలు పెరిగిపోయి ద్రవ్యోల్బణానికి దారి తీసిందని, విదేశీ కరెన్సీ నిల్వలు తరిగిపోయినందువలన బంగ్లాదేశ్ కరెన్సీ మారకపు విలువ తగ్గిపోయిందని, ఆ విధంగా పడిపోకుండా ఉండడానికి చేసిన ప్రయత్నాలు ఫలితాన్నివ్వలేదని వారు వివరిస్తున్నారు. ఈ వివరణలో ఒక లోపం ఉంది. ఇది కేవలం దిగుమతులపైనే తన ఫోకస్ అంతటినీ పెట్టింది. బంగ్లాదేశ్ నుండి జరిగే ఎగుమతుల్లో 83 శాతం రడీమేడ్ దుస్తులదే. ఇప్పుడు దాని ద్వారా వచ్చే ఆదాయం తగ్గిపోయింది. ఈ



విషయాన్ని పై వివరణ పరిగణనలోకి తీసుకోలేదు. కొందరు బంగ్లాదేశీ ఆర్థికవేత్తలు తమ ప్రభుత్వం అనుసరించిన ద్రవ్య విధానమే ఈ దుస్థితికి కారణం అని నిందిస్తున్నారు. వారి వాదన ఇలా ఉంది: బంగ్లాదేశ్ ప్రభుత్వం తన వడ్డీ రేట్లను ఎప్పటికప్పుడు పెంచకుండా స్థిరంగా చాలాకాలం కొనసాగించింది. ఒకవేళ వడ్డీరేట్లను వెంటవెంటనే పెంచివుంటే విదేశాలనుండి ప్రైవేటు ద్రవ్య పెట్టుబడులు ఎక్కువగా దేశంలోకి వచ్చివుండేవి. వాటి తోడ్పాటుతో విదేశీ చెల్లింపుల లోటు ఏర్పడకుండా చూసుకోవడం సాధ్యం అయివుండేది. అప్పుడు బంగ్లాదేశ్ కరెన్సీ మారకపు రేటు కూడా పడిపోకుండా నిలదొక్కుకోగలిగేది. కరెన్సీ మారకపు రేటు పడిపోయినందువలన ఇప్పుడు విదేశీ పెట్టుబడులు రాకుండా నిలిచిపోయిన పరిస్థితి అప్పుడు ఏర్పడేది కాదు. ఐతే ఈ వాదన కూడా పైపై పరిశీలనతో చేసినదే. బంగ్లాదేశ్ వృద్ధి సాధించడం కోసం అనుసరించిన వ్యూహంలోనే అసలు లోపం ఉంది. నయా ఉదారవాద కాలంలో చాలా ఇతర దేశాల మాదిరిగానే బంగ్లాదేశ్ కూడా ఎగుమతులను బాగా పెంచడం ద్వారా వృద్ధి సాధించాలనే వ్యూహాన్ని చేపట్టింది. దాదాపు ఒక అర్ధ శతాబ్దం కాలంగా ఆర్థికవేత్తల మధ్య చర్చల్లో ఎగుమతులపై ఆధారపడి అభివృద్ధి సాధించాలనే వ్యూహం వెనుక విజ్ఞత ఏమిటన్న చర్చ ఒక భాగంగా ఉంది. తూర్పు ఆసియా దేశాలు సాధించిన "అద్భుతం"తో పోల్చితే భారతదేశంలో వృద్ధి చాలా మందకొడిగా ఉందంటూ పోలిక తెచ్చి ఆ విధంగా వృద్ధిరేటులో భారత్ వెనకబడిపోడానికి కారణం అది "లోలోపలికి ముడుచుకుపోయే దృష్టి"తో వ్యవహరించడమే అని ప్రపంచ బ్యాంక్ విమర్శిస్తూ వచ్చింది. ఐతే వాస్తవ జీవితంలో ముఖ్యమైన పాత్ర పోషించే ఒకానొక అంశాన్ని ఈ చర్చ పూర్తిగా విస్మరించింది.ఒక దేశపు ఆర్థిక వ్యవస్థలో ఉండే మొత్తం డిమాండ్‌లో రకరకాల ఖర్చులు అంతర్భాగంగా ఉంటాయి. వీటిలో కొన్ని స్వయంప్రతిపత్తితో ఉంటాయి. అంటే ఇతర అంశాలమీద ఆధారపడకుండా ఉంటాయి. మరికొన్ని ఆ మొత్తం డిమాండ్ ఏ వేగంతో పెరుగుతోంది అన్న అంశంమీద ఆధారపడి వుంటాయి. ఎగుమతులు, ప్రభుత్వ వ్యయం-ఈ రెండూ స్వయంప్రతిపత్తి కలిగిన ప్రధాన ఖర్చులు. ప్రజల వినిమయ ఖర్చు వారి వారి ఆదాయాల స్థాయిని బట్టి ఉంటుంది (ఒక్కోసారి అందుకు భిన్నంగా ప్రజల వినిమయం కూడా స్వయంప్రతిపత్తి తో వ్యవహరించే సందర్భాలు ఉంటాయి. ఉదాహరణకు: చాలాకాలంగా మార్కెట్‌లో లభించని సరుకు ఉన్నట్టుండి దొరకడం మొదలైతే ప్రజలు ఆ సరుకును తమ తమ ఆదాయాలతో నిమిత్తం లేకుండా కూడా కొంటారు.). ఒక ఆర్థిక వ్యవస్థలో డిమాండ్ పెరిగినప్పుడే ఆ మేరకు ఉత్పత్తి కూడా పెరుగుతుంది. అప్పుడే ఆ ఆర్థిక వ్యవస్థ వృద్ధి సాధిస్తుంది. అందుచేత డిమాండ్‌ను పెంచాలంటే స్వయంప్రతిపత్తి కలిగిన అంశాలమీద దృష్టి పెంచాలి (అంటే ఎగుమతులను పెంచడం, ప్రభుత్వ వ్యయాన్ని పెంచడం). ప్రస్తుత నయా ఉదారవాద వ్యవస్థలో దేశాల హద్దుల్ని స్వేచ్ఛగా దాటి ద్రవ్య పెట్టుబడులు ప్రవహించే పరిస్థితి ఉంది. ఆ పెట్టుబడుల ప్రవాహం ఆగిపోకుండా ఉండాలంటే ఏ దేశమైనా ఒకానొక స్థాయిని మించి తన బడ్జెట్‌లో ద్రవ్యలోటును పెరగనివ్వకూడదు. అదే సమయంలో ఆ విధానాల ఒత్తిడి కారణంగా తన దేశంలో సంపన్నులపై పన్నులను పెంచేందుకు ఏ ప్రభుత్వమూ సిద్ధం కాదు. అందువలన ప్రభుత్వ వ్యయాన్ని పెంచే అవకాశాలు పరిమితం అయిపోయాయి. ఇక వృద్ధి సాధించాలంటే ఎగుమతులను పెంచడం ఒక్కటే మార్గం. నయా ఉదారవాద వ్యవస్థలో ఆర్థిక వృద్ధి ప్రధానంగా ఎగుమతులపైన ఆధారపడి జరుగుతుంది. ఇలా ఎగుమతులపై ఎక్కువగా దృష్టి పెట్టి ఏదైనా దేశం వృద్ధిసాధించవచ్చు. కాని ఏ దేశానికైనా వృద్ధిని కొనసాగించే విషయంలో ప్రభుత్వం పోషించే పాత్ర ఇరుసులాగా పని చేస్తుంది. తూర్పు ఆసియా దేశాల ప్రభుత్వాలు అటువంటి పాత్రనే పోషించాయని కొందరు వాదిస్తూంటారు కూడా. ఎగుమతులను బాగా పెంచడం ద్వారా వృద్ధి సాధించాలనే దేశాలలో రెండు తరహాలవి ఉన్నాయి. వాటి మధ్య తేడాను మనం చూడగలగాలి. మొదటి తరహా దేశాలు ఒక క్రమ పద్ధతిలో తమ ఎగుమతులను పెంచుకుంటూ ఆ క్రమంలో వాణిజ్య చెల్లింపు ఖాతాలో మిగులు సాధించి తమ విదేశీ మారకపు నిల్వలను భారీగా పెంచుకుంటాయి. ఈ తరహా దేశాలకు ప్రధాన ఉదాహరణ చైనా. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఎటువంటి ప్రతికూల పరిణామాలు వచ్చినా, ఆ ప్రభావం వలన ఆ దేశపు విదేశీ వాణిజ్య ఖాతాలో ఉన్న మిగులు కొంతమేరకు తగ్గుతుందే తప్ప అంతకు మించి ఆ దేశపు ఆర్థిక వ్యవస్థ ఎటువంటి ఆర్థిక సంక్షోభంలోనూ చిక్కుపడిపోదు. ఐతే, చాలా దేశాలు రెండో తరహాకు చెందుతాయి. ఈ దేశాల విదేశీ వాణిజ్య చెల్లింపుల ఖాతాలో ఎప్పుడూ లోటు కొనసాగుతూనే వుంటుంది తప్ప మిగులు ఉండదు. ఆ లోటును ప్రైవేటు ద్రవ్య పెట్టుబడి ప్రవాహాల సహాయంతో పూడ్చుకుంటూ వుంటాయి. వాటి వద్ద విదేశీ మారకపు నిల్వలు ఉంటాయి. ఐతే అవి ప్రధానంగా రుణాల ద్వారా సమకూర్చుకున్నవే. భారతదేశం ఈ కోవకే చెందుతుంది. దక్షిణాసియా దేశాలలో చాలా భాగం, మూడో ప్రపంచ దేశాలలో చాలా భాగం ఈ కోవకే చెందుతాయి. ఈ తరహా దేశాలలో విదేశీ వాణిజ్య చెల్లింపుల ఖాతాలో లోటు ఒక్కోసారి వేరే వేరే కారణాల వలన పెరిగిపోవచ్చు. అది కరోనా కాలంలో టూరిస్టులు తగ్గిపోయినందువలన విదేశీ మారకపు ఆదాయం పడిపోవడం వంటిది కావచ్చు (శ్రీలంకలో జరిగినట్టు). లేదా ఉక్రెయిన్ యుద్ధం కారణంగా దిగుమతుల ధరలు పెరిగిపోయి లోటు పెరిగిపోవచ్చు. లేదా, ప్రపంచవ్యాప్త ఆర్థిక మాంద్యం కారణంగా ఎగుమతులు తగ్గిపోయి దాని ఫలితంగా లోటు పెరిగిపోవచ్చు (బంగ్లాదేశ్‌లో ఈ రెండు కారణాలూ ప్రభావాన్ని చూపాయి). ఇటువంటి సమయాల్లో ఆ లోటును పూడ్చడానికి ప్రైవేటు ద్రవ్య పెట్టుబడి ప్రవాహాలు బాగా అవసరం అవుతాయి. కాని సరిగ్గా అటువంటి సమయాల్లోనే ఆ ప్రైవేటు ద్రవ్య పెట్టుబడి లోటును పూడ్చేబదులు దేశాన్ని వదిలిపెట్టి బైటకు పోతుంది. దానివలన ఆ లోటు మరింత పెరగుతుంది. దేశం సంక్షోభంలో పడుతుంది. ప్రైవేటు ద్రవ్య పెట్టుబడికి తన స్వంత లాభాలే ముఖ్యం. ఏ దేశం ఏమౌతుందోనన్న ఆందోళన దానికేమీ ఉండదు. ఒక దేశంలో స్థానిక కరెన్సీ విలువ పడిపోతే అక్కడ తమకు వచ్చే లాభాల విలువ కూడా తగ్గుతుంది గనుక ఆ ప్రైవేటు పెట్టుబడి అక్కడి నుండి బైటకు పోడానికే సిద్ధపడుతుంది. అప్పుడు విదేశీ మారకపు లోటు మరింత తీవ్ర సమస్యగా ఆ దేశానికి మారుతుంది. అటువంటి పరిస్థితుల్లో కూడా నయా ఉదారవాదులు, స్వేచ్ఛా మార్కెట్ వాదులు చెప్పినట్టు పరిస్థితులను మార్కెట్ శక్తులకే విడిచిపెడితే ఇక ఆ దేశంలో పరిస్థితి ఎన్నటికీ మామూలు స్థితికి రాదు. అప్పుడే ఆ దేశాల ప్రభుత్వాలు ఐఎంఎఫ్ వంటి సంస్థలను ఆశ్రయిస్తాయి. అక్కడినుండి లభించే రుణంతో విదేశీ చెల్లింపుల లోటు సమస్యను అధిగమించవచ్చునన్న అంచనాలు ఏర్పడగానే ప్రైవేటు ద్రవ్య పెట్టుబడి అక్కడినుండి బైటకు పోవాలన్న ప్రయత్నాన్ని విరమించుకుంటుంది. ఎందుకంటే ఆ రుణం తోడ్పాటుతో ఆ దేశపు కరెన్సీ మారకపు రేటు పడిపోకుండా నిలబడుతుంది అన్న అంచనాకి వస్తుంది. ఐతే అ రుణానికి బదులుగా ఐఎంఎఫ్ చాలా భారీ మూల్యాన్నే కోరుతుంది. సంక్షేమ కార్యక్రమాలకి చేసే ఖర్చు తగ్గించాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను ఎత్తివేయాలని, ప్రభుత్వ రంగ ఆస్తులను విదేశీయులకు అప్పగించాలని - ఇలా ఉంటాయి ఐఎంఎఫ్ షరతులు. నిజానికి విదేశీ చెల్లింపులలో లోటు పెరగడం అనేది మొదట చాలా స్వల్ప మోతాదులోనే ఉంటుంది. అది ఉన్నట్టుండి ఒక్కసారి అమాంతం భారీ లోటుగా పెరిగిపోవడం అనేది ప్రైవేటు ద్రవ్య పెట్టుబడి పుణ్యమే. ఉన్నట్టుండి ప్రైవేటు ద్రవ్య పెట్టుబడి ఆ దేశం నుండి ఉడాయించగానే విదేశీ చెల్లింపుల లోటు అమాంతం విపరీతంగా పెరిగిపోయి దాని నుండి బైటపడడానికి ఆ దేశ ప్రభుత్వం ఐఎంఎఫ్ దృతరాష్ట్ర కౌగిలిలో చిక్కుకుపోతుంది. ఆర్థిక వృద్ధిలో అద్భుతాలు సాధించిన దేశాలు ఉన్నట్టుండి బిచ్చమెత్తుకునే స్థితికి దిగజారిపోవడం ఇందువలనే జరుగుతుంది. ఎగుమతుల మీద ఆధారపడి సాధించే ఆర్థిక వృద్ధి పైకి ఒక విజయంలా కనిపించినా, ఒక్క దెబ్బకి అదంతా మటుమాయం అయిపోయే ప్రమాదం ఉంది. ఎందుకంటే, ఆ వృద్ధి అంతా అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి దయ మీద ఆధారపడి వుంటుంది. ఆ ద్రవ్య పెట్టుబడి దురాశకే ఆ వృద్ధి కాస్తా బలైపోతుంది కూడా. మన పొరుగు దేశాలలో ఇదే విధంగా జరిగింది. శ్రీలంక గాని, బంగ్లాదేశ్ కాని మొదట్లో మానవాభివృద్ధి విషయంలో చాలా మంచి విజయాలను సాధించాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మాంద్యంలో చిక్కుకోవడం, దాని వలన చాలా మూడో ప్రపంచ దేశాల ఎగుమతులు దెబ్బ తినడం ఫలితంగా ఇప్పుడు బిచ్చమెత్తుకునే దేశాల లిస్టు పెరుగుతోంది. రాబోయే రోజుల్లో మరింత పెరుగుతుంది. చాలా ఎక్కువ స్థాయిలో తమ వద్ద విదేశీ మారకపు నిల్వలు ఉన్నాయన్న ధీమా వలన ఉపయోగం లేదు. ఆ నిల్వల్లో ఎక్కువ భాగం వాణిజ్యంలో సాధించిన మిగులు వలన ఏర్పడిందేమీ కాదు. విదేశీ ప్రైవేటు ద్రవ్య పెట్టుబడి అందులో అత్యధిక భాగంగా ఉంది. భారత దేశానికి ఉన్న ఒకే ఒక్క భరోసా ఏమిటంటే ఆహారధాన్యాల నిల్వలు మన దగ్గర బాగా ఉండడం (అది కూడా మన ప్రజలు అందరూ కడుపునిండా తినలేని పరిస్థితి వలన ఏర్పడిన నిల్వలే). ఇంకొక సానుకూల అంశం అమెరికా ఆంక్షలకు గురైన రష్యా నుండి చమురు దిగుమతులు చేసుకునే వీలు ఉన్న అంతర్జాతీయ పరిస్థితులు. ఒకవేళ మోడీ చేసిన నల్ల వ్యవసాయ చట్టాలు గనుక అమలు లోకి వచ్చివుంటే ఈ పాటికి మన ఆహార నిల్వలు కాస్తా కరిగిపోయి వుండేవి. అంటే ఇప్పుడు దేశాన్ని కాపాడినది ఆ రోజు రైతులు సాగించిన పోరాటమే. రెండు ప్రపంచ యుద్ధాల నడుమ కాలంలో వచ్చిన అనుభవాలతో ఎగుమతులపై ఆధారపడి ఆర్థిక వృద్ధి సాధించాలన్న వ్యూహాన్ని చాలా దేశాలు విడిచిపెట్టాయి. నయా ఉదారవాద విధానాలు ముందుకొచ్చాక ఆ నాడు విడిచిపెట్టిన వ్యూహమే మళ్ళీ ముందుకొచ్చింది. ఇప్పుడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మరొకసారి సంక్షోభంలో చిక్కుకుంది. అందుచేత ఈ వ్యూహానికి కాలం చెల్లే సమయం దగ్గరపడింది.

## పాలకులు బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు ఉధృతం అవుతాయి




మచిలీపట్నం టౌన్ జూన్ 20: ప్రజాపాలన బ్రాహ్మణులు ఐక్యతతో ముందుకు వెళుతూ హక్కులను సాధించుకోవాలి...రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గన్నవరపు శ్రీనివాస్. రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నవరపు శ్రీనివాస్ మంగళవారం మచిలీపట్నం విచ్చేసి పలువురు బ్రాహ్మణ పెద్దలను మర్యాదపూర్వకంగా కలసి భవిష్యత్తు కార్యాచరణ పై చర్చించి, మచిలీపట్నంలో శిడింబి అగ్రహారంలో మీడియాతో మాట్లాడుతూ.బ్రాహ్మణ కార్పొరేషన్ నిర్వీర్యము అయిపోవడంతో రాష్ట్రంలోని పలువురు బ్రాహ్మణులు గత నాలుగు సంవత్సరాలుగా ఎన్నో రకాల ఇబ్బందులు పడుతున్నారు అన్నారు.బ్రాహ్మణ కార్పొరేషన్ కాపాడుకోవాల్సిన బాధ్యత రాష్ట్రంలోని బ్రాహ్మణులందరి పై ఉంది అన్నారు.అందులో భాగంగానే రాష్ట్రవ్యాప్త పర్యటనలు చేస్తూ రాష్ట్రంలోని బ్రాహ్మణ పెద్దలను కలుస్తూ బ్రాహ్మణ కార్పొరేషన్ మనుగడపై ఎలా ముందుకు వెళ్లాలి అని బ్రాహ్మణ పెద్దల సలహాలు తీసుకుంటున్నామని, త్వరలోనే బ్రాహ్మణ కార్పొరేషన్ ను కాపాడుకునే విధంగా ఐక్య కార్యాచరణ రూపొందిస్తున్నాము అన్నారు.అలాగే రాష్ట్రంలోని బ్రాహ్మణులు ఎన్నో రకాల ఇబ్బందులు పడుతున్నారని, రాష్ట్ర వ్యాప్త పర్యటనలో భాగంగా బ్రాహ్మణుల సమస్యలు తెలుసుకుంటు ఆ సమస్యలపై ప్రభుత్వానికి తెలిసే విధంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టరేట్ కార్యాలయాల్లోనూ త్వరలోనే వినతి పత్రాలు అందజేయడం జరుగుతుంది అన్నారు. బ్రాహ్మణులు ఐక్యతతో ఉంటూ మన హక్కులను సాధించుకోవాలి అన్నారు.బ్రాహ్మణులకు అన్యాయం చేసిన పాలకులకు పుట్టగతులు ఉండవు అన్నారు.స్వతంత్ర సమరయోధుడు బ్రాహ్మణ ముద్దుబిడ్డ డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య జ్ఞాపకార్థం స్మారక భవనం ఏర్పాటు చేయడానికి సాక్షాత్తు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మచిలీపట్నంలో రెండు ఎకరాలు స్థలం కేటాయించిన పాలకులు అడ్డుకోవడం దుర్మార్గమని, సదరు విషయాన్ని రాష్ట్రంలోని బ్రాహ్మణ పెద్దల అందరి దృష్టికి తీసుకువెళ్లినామని త్వరలోనే మచిలీపట్నంలో భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవనం నిర్మాణం కోసం జిల్లా కలెక్టరేట్ ను ముట్టడిస్తాము అన్నారు.జిల్లా ప్రధాన కేంద్రమైన మచిలీపట్నం లో భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవనం పనులు మొదలు పెట్టకపోతే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని కలిసేందుకు కూడా ప్రయత్నం చేస్తున్నాము అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు, వేమూరి రామకృష్ణారావు, పి.వి ఫణి కుమార్ తదితరులు పాల్గొన్నారు..

## టీడీపీ హయాంలో నిర్మించిన ఇళ్లు తామే నిర్మించినట్టు వైసీపీ నాయకులు బిల్డప్పివ్వటం సిగ్గు చేటు



పల్నాడు జిల్లా .నరసరావుపేట .జూన్ 20 (ప్రజా పాలన ప్రతినిధి) :బి2019 టీడీపీ హయాంలో కేంద్ర నిధుల సహాయంతో నరసరావుపేట పట్టణంలో 1504 టిడ్కో గృహాలను నిర్మించామన్నారు.ఆ ఇళ్లకు రూ.50 వేలు డిపాజిట్ చేసిన లబ్దిదారులను కాదని,వైసీపీ కార్యకర్తలకు కేటాయించటం ఏంటని నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్–ఛార్జ్ డా.చదలవాడ అరవింద బాబు నిలదీశారు.అసలైన లబ్దిదారులకే ఇళ్లు కేటయించాలని కోర్టు కూడా మున్సిపల్ అదికారులకు నోటిసులు పంపించారని అన్నారు.కానీ మంత్రి ఆదిమూలపు సురేష్,స్థానిక ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఎలా వాటిని ప్రారంభిస్తారని అన్నారు.ఇది కోర్టు దిక్కరణ కిందకే వస్తుందని,దీని పై కోర్టును ఆశ్రయిస్తామని డా??చదలవాడ హెచ్చరించారు.టీడీపీ హయాంలో నిర్మించిన ఇళ్లుకు రంగులు వేసుకుని తామే నిర్మించినట్టు వైసీపీ నాయకులు బిల్డప్పివ్వటం సిగ్గు చేటన్నారు.టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అసలైన లబ్దిదారులకే ఇళ్లను కేటాయిస్తామని డా.చదలవాడ తెలిపారు.ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు గోనుగుంట్ల కోటేశ్వరరావు,వేల్పుల సింహాద్రి యాదవ్,రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల అధ్యక్షులు పూదోట సునీల్,కడియం కోటి సుబ్బారావు,జిల్లా నాయకులు కుమ్మేత కోటి రెడ్డి,దాసరి ఉదయ్ శ్రీ, గాడిపర్తి సురేష్,కాంద్రతి సాంబయ్య,కొర్నేపాటి సంజీవ్ రావు,జాను,బాషా,దమ్మాటి మల్లికార్జున రావు,చల్లగుండ్ల హరిక్రిష్ణ,సత్యనారాయణ,పాపారావు,తిరుమలశెట్టి రమేష్,అజయ్,షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే గ్రంధిని కలిసిన ప్రభుత్వ న్యాయవాది



భీమవరం, జూన్ 20 (ప్రజాపాలన ప్రతినిధి) :భీమవరం కోర్టులకు సంబంధించి నూతనంగా నియమితులైన ఏజిపి ప్రభుత్వ న్యాయవాది యు. వర ప్రసాద్ మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాసును మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, సీనియర్ న్యాయవాది రాయప్రోలు శ్రీనివాసమూర్తి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం రమణారావు, ఏపీపీ మారిశెట్టి వెంకటేశ్వర్లు, కామన నాగేశ్వరరావు,అల్లూరి శివాజీ రాజు, పలువురు సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

# రాబోవు ఎన్నికల్లో టీడీపీ పక్షాన వీరే పోటీ చేస్తారా..?













మచిలీపట్నం జూన్ 20: ప్రజాపాలన :రానున్న ఎన్నికలలో కృష్ణాజిల్లా మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ పరిధి లో ఉన్న అసెంబ్లీ నియోజక వర్గాల్లో తెలుగు దేశం పార్టీ అభ్యర్థులు గా ఎవరు ఎవరు పోటీ చేస్తున్నారు అన్న దానిపై రసవత్తర మైన చర్చ జరుగతోంది .ఇప్పటి వరకూ తెలుగు దేశం పార్టీ ఏ పార్టీ తో పొత్తు పెట్టుకుంటుందో స్పష్టమైన సందేశాలు అందటం లేదు . ఖచ్చితం గా జనసేనతో పొత్తు ఉంటుంది అని అందరూ ఊహించారు అయితే అందుకు భిన్నం గా రాజకీయ వాతావరణం వేడెక్కింది. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వైసీపీ నీ ఓడించడవే తమ ధ్యేయమని అందుకోసం తాను కొంత త్యాగం చేయక తప్పదు అనుకుంటూ వచ్చారు .దీనితో పవన్ పూర్తిగా తెలుగు దేశం తోనే ఎన్నికల పొత్తు పెట్టుకుని విజయం సాధిస్తే చంద్ర బాబు ను ముఖ్యమంత్రి గా అంగీకరిస్తారు అని రాజకీయ పరిశీలకులు అంచనా వేశారు .అయితే రాజకీయాలు ఎప్పుడు ఏ క్షణములో ఏ మార్పులు జరుగుతాయో చెప్పలేని పరిస్థితి ఏర్పడింది.ఇప్పుడు పవన్ తన సభల్లో ఒక్కసారి తనను ముఖ్యమంత్రి గా ఎన్నుకుని ఆశీర్వదించండి ముఖ్యమంత్రి అయితే రాష్ట్రము లో ఒక చక్కని పాలనతో పాటు అవినీతికి తావు లేకుండా అభివృద్ధి ఏ ధ్యేయం గా పెట్టుకుని పని చేస్తాను అని తన వాగ్దాటి తో ప్రజలను ఆకట్టుకుంటున్నారు . ఈ పరిస్థితులూ తెలుగు దేశం జనసేన పొత్తు లేకుండా ఉంటే జరిగే రాజకీయ పరిణామాలు పలు షికారు చేస్తున్నాయి .ఈ నేపథ్యం లో పొత్తు లేకపోతే తెలుగు దేశం పార్టీ అభ్యర్థుల్లో కృష్ణా జిల్లా నుంచీ పాలనా వారు పోటీ చేస్తున్నారు అన్న సమాచారం అందుతోంది.

**అవనిగడ్డ నియోజకవర్గం :**
ఈ అసెంబ్లీ నియోజకవర్గం నుండీ మాజీ మంత్రి మండలి బుద్ధ ప్రసాద్ పోటీచేశారు. నియోజకవర్గం లో మండలి కుటుంబానికి మంచి గుర్తింపు ఉంది. బుద్ధప్రసాద్ తండ్రి వెంకట కృష్ణారావు ఈ నియోజకవర్గానికి మంచి గుర్తింపు తీసుకుని వచ్చారు .అయితే అవినిగడ్డ నియోజకవర్గం నుండీ తెలుగు దేశం పార్టీ తరుపున పొట్టే చేయడానికి అర్హత ఉన్న ఓకే ఒక్క వ్యక్తి మండలి బుద్ధప్రసాద్ మచ్చ లేని నాయకుడిగా ఎటువంటి అవినీతి ఆరోపణలు లేని బుద్ధప్రసాద్ అవనిగడ్డ నియోజక వర్గం నుండే పోటీ చేసే అవకాశాలు ఉన్నాయి.

**మచిలీపట్నం నియోజకవర్గం:**
ఈ నియోజక వర్గం నుంచీ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి గా మాజీ మంత్రి పొలిట్ బ్యూరో సభ్యులు కొల్లు రవీంద్ర ఖచ్చితంగా పోటీచేస్తారు. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పార్టీ పటిష్టత కోసం పనిచేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం లో ఎన్నో అవమానాలను, పరాభవాలను, రవీంద్ర ఎదురుకున్నారు.అకారణం గా ఒక హత్య కేసుకు వైసీపీ ప్రభుత్వం జైలు కు కుడా పంపించింది,అయినా రవింద్ర అదరక చెదరక పార్టీ కోసం అందరినీ కూడగట్టుకుని ముందుకు వెళుతున్నారు అందువలన కొల్లు రవింద్ర నే పోటీ చేసే అవకాశాలు ఎక్కువగ్గా ఉన్నాయి

**పెడన నియోజకవర్గం :**
ఈ నియోజక వర్గం లో పార్టీలో ఒక విచిత్ర మైన పరిస్థితి ఏర్పడింది. ఈ నియోజక వర్గం నుంచీ రెండు సార్లు పోటీ చేసిన మాజీశాసన సభ్యులు,మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్ తెలుగుదేశం పార్టీ తరుపున పోటీ చేయడానికి సమాయుక్తము అయ్యారు . అలాగే మాజీ శాసన సభ్యులు స్వర్గీయ కాగిత వెంకటరావు తనయుడు కాగిత కృష్ణప్రసాద్ కూడా టీడీపీ తపున పోటీచేయుటకు సిద్ధం గా ఉన్నామని చెబుతున్నారు. ఆ ఇద్దరు చంద్ర బాబు తన ఆశిస్సులు తమకే ఉన్నాయి అని చెప్పుకుని ప్రచారం చేయడం విశేషం. గత ఎన్నికల్లో కృష్ణప్రసాద్ ఓడిపోయినా చంద్ర బాబు ఆదేశాల మేరకు బూరగడ్డ వ్యాస్ ,కృష్ణప్రసాద్ గెలుపు కోసం ఎంతగానో కృషి చేశారు.అయినా వైసీపీ గాలిలో కృష్ణ ప్రసాద్ పరాజితులు అయ్యారు. రాబోయే ఎన్నికల్లో వ్యాసా లేక ప్రసాదా ఎవరు పోటీ చేస్తారు అన్నది చర్చగా మారింది. ఈ నియోజకవర్గం లో టీడీపీ నాయకులు కలసిగట్టుగా (ఎవరికి సీటు ఇచ్చినా )పోటీ చేస్తే ఖచ్చితం గా విజయం వస్తుంది అన్న అభిప్రాయం ఉంది .

## భవిష్యత్తుపై భరోసానిస్తున్న "మార్నింగ్ టీ విత్ నల్లపాటి"




పల్నాడు జిల్లా .నరసరావుపేట. జూన్ 20 (ప్రజా పాలన ప్రతినిధి): తెలుగుదేశంపార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "భవిష్యత్తుకు గ్యారెంటీ" కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరికీ చేరువ చేయాలనే లక్ష్యంతో తెలుగుదేశంపార్టీ రాష్ట్ర కార్యదర్శి నల్లపాటి రామచంద్రప్రసాద్ (రాము) వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. "మార్నింగ్ టీ విత్ నల్లపాటి" అనే కార్యక్రమం ద్వారా నరసరావుపేట నియోజకవర్గంలో ఉదయాన్నే టీ దుకాణాల వద్ద ప్రజలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకుంటున్నారు. దీనిలో భాగంగా మంగళవారం పట్టణంలోని ప్యారడైజ్ కళ్యాణ మండపం సెంటర్ టీ దుకాణం వద్ద స్థానిక ప్రజలను కలిసి.. వారికి తన చేతుల మీదుగా స్వయంగా టీ, కాఫీలను అందజేసారు. అనంతరం స్థానిక సమస్యలను ప్రజల నుండి తెలుసుకోవడంతో పాటు తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన "భవిష్యత్తుకు గ్యారెంటీ" గురించి వారికి అవగాహన కల్పించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే ఎలాంటి మంచి జరుగుతుందో అందరికీ వివరించారు. అనంతరం నల్లపాటి రాము మీడియాతో మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకునేందుకే "మార్నింగ్ టీ విత్ నల్లపాటి" కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఎవ్వరిని కదిలించిన ఈ దుర్మార్గపు ప్రభుత్వంలో ఎదుర్కొంటున్న కష్టాలే చెబుతున్నారని, ఏపీకి పూర్వ వైభవం రావాలంటే తెలుగుదేశంపార్టీ మళ్లీ అధికారంలోకి రావాలన్నారు. టీడీపీ జాతీయ



అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు "భవిష్యత్తుకు గ్యారెంటీ" పేరుతో బృహత్తరమైన మినీ మేనిఫెస్టోను ప్రకటించారని, ప్రజలందరికీ వీటి ద్వారా జరిగే మేలును తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. "మార్నింగ్ టీ విత్ నల్లపాటి" కార్యక్రమం ద్వారా నిత్యం ప్రజల్లో ఉంటానని, నరసరావుపేటలో తెలుగుదేశం ఎగిరే వరకూ విశ్రమించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు మెడబలిమి నవీన్ కుమార్, ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షులు అడుసుమిల్లి అప్పారావు, యాలమంద గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు యర్రమాసు ప్రసాద్, పల్నాడు జిల్లా తెలుగు యువత అధ్యక్షులు కోట నాగ సుధీర్, నియోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షులు కూరపాటి శ్రీను, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## మంచినీటి సరఫరాపై ముదునూరి సమీక్ష



నరసాపురం, జూన్ 20 (ప్రజాపాలన ప్రతినిధి) :పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన మంచినీటిని అందించేందుకు మంచినీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన స్థానిక క్యాంపు కార్యాలయంలో మునిసిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన అధికారులకు పలు ఆదేశాలు జారీచేశారు. పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన మంచినీటి సరఫరా చేసేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఫిల్టరింగ్, క్లోరినేషన్, ప్యూరిఫికేషన్ విషయంలో అలసత్వం వహించవద్దని ఆయన ఆదేశించారు. మంచినీటి సరఫరాలో ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే వెంటనే పరిష్కరించే దిశగా సంభందిత అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వర్షాకాలం సమయంలో గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని డ్రైనేజీలలో పూడిక తీత పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. పట్టణంలో ఎప్పటికప్పుడు పారిశుధ్య నిర్వహణ జరగాలని వార్డులలో ఎలాంటి ఫిర్యాదులు రాకుండ అధికారులు చర్యలు తీసుకోవాలని నిర్మాణదశలో ఉండి ఇంకా పూర్తికాని అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఓపెన్ ఎయిర్ థియేటర్ నిర్మాణం పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బర్రె శ్రీ వెంకటరమణ, వైస్ చైర్ పర్సన్ కామన నాగిని, మున్సిపల్ కమిషనర్ కోడూరు వెంకటేశ్వరరావు, మునిసిపల్ డిఈ, ఏఈలు పాల్గొన్నారు.

## ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలి



నరసాపురం, జూన్ 20 (ప్రజాపాలన ప్రతినిధి) : సచివాలయ సిబ్బంది ప్రతి ఒక్కరూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ఆదేశించారు. మంగళవారం నరసాపురం మండలం సరిపల్లి గ్రామ సచివాలయంను ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి పలు ఆదేశాలు జారీచేశారు. విధులకు ఆటంకం కలగకుండా సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు సమన్వయంతో పని చేయాలని ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆయన సూచించారు. విధులకు సక్రమంగా హాజరుకాని వీఆర్వో , వాలంటీర్లపై చర్యలు తీసుకోవాలని స్థానిక ఎంపీడీవో శివ ప్రసాద్ యాదవ్ ను ఆదేశించారు. సచివాలయంలో రికార్డులను, హాజరు పట్టీలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి రైతులకు ధాన్యం డబ్బులు చెల్లింపుల విషయంలో లోటు పాట్లు ఉంటే సరిచేసి వెంటనే చెల్లించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వేగవంతంగా పట్టణ అభివృద్ధి: ఎమ్మెల్యే గ్రంధి



భీమవరం, జూన్ 20 (ప్రజాపాలన ప్రతినిధి) :భీమవరం పట్టణాన్ని వేగవంతంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకున్నామని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. గత నాలుగేళ్లుగా భీమవరం పట్టణ అభివృద్ధికి రూ 62 కోట్ల నిధులను ఖర్చు చేయడం జరిగిందని ప్రతి వార్డులోను సిసి రోడ్ల నిర్మాణంతోపాటు డ్రైనేజీ నిర్మాణాలను కూడా పూర్తి చేసామని అన్నారు. మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో పట్టణ అభివృద్ధిపై ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలో మరో ఏడు కోట్ల17 లక్షల నిధులతో చేపట్టే పనులకు త్వరలోనే శ్రీకారం చుడతామన్నారు. పట్టణ అభివృద్ధికి సంబంధించి ప్రతివారం నివేదికలను అందించాలని మున్సిపల్ అధికారులను ఆయన ఆదేశించారు. చేపల మార్కెట్లో నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ హాలును త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఏడవవార్డులోని లెప్రసికాలనీలో కూడా కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి చర్యలు తీసుకోవడం జరిగిందని ఆర్టీసీ డిపో వెనుక, రూపాంతరం దేవాలయం వద్ద మెయిన్ డ్రైన్లను అభివృద్ధి చేయనున్నామని అన్నారు. అమృత పథకంలో ఇప్పటికే పూర్తయిన రెండు మంచినీటి రిజర్వాయర్లను త్వరలోనే వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. మున్సిపాలిటీలో ఖాళీగాఉన్న డిఈ, ఏఈ పోస్టులను వెంటనే భర్తీ చేయడానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. విస్సాకోడేరు లే అవుట్, జగనన్న కాలనీలలో లబ్ధిదారులు గృహ నిర్మాణాలను వేగవంతం చేశారని, లేఔట్లోకి ఇంటి నిర్మాణ మెటీరియల్ తీసుకెళ్ళేందుకు వెంటనే రహదారిని నిర్మిస్తామని తెలిపారు. రాష్ట్రంలోనే భీమవరం పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు తనవంతు కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎస్ శివరామకృష్ణ, ఎంఈ త్రినాధరావు, డిఈలు తోట నారాయణరావు, విజయ్, ఏఈలు శ్రీనివాస్, నవ్య, కృష్ణమూర్తి తదితర అధికారులు పాల్గొన్నారు.

## తమ్ముడిని స్మరించుకుంటూ ఈగం ప్రసాదరావు అన్నదానం



బాపట్ల జిల్లా ప్రజా పాలన జూన్ 20: బాపట్ల చిన్నారుల ఆకలి తీరుస్తే దేవుడికి ప్రసాదం అందించినట్లేనని ఈగం ప్రసాదరావు అన్నారు. పట్టణంలోని శారా ఫెయిత్ ఫౌండేషన్ లో చిన్నారులకు ఈగం నాగరాజు 18వ వర్ధంతి సందర్భంగా ఆంధ్రప్రభ బాపట్ల ఇన్ ఛార్జ్ ఈగం ప్రసాద్ రావు అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి చిన్నారులకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తన తమ్ముడిని స్మరించుకుంటూ సేవా కార్యక్రమం చేస్తానని,ఈ సంవత్సరం ఫౌండేషన్ లోని అనాథ చిన్నారులకు ఆహారం అందజేయడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తుందని తన తమ్ముడి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో ఈగం పవన్ సాయి, వేజెండ్ల శ్రీనివాసరావు,బుర్ర ఆంజనేయులు, యాసం రాజా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## 1వ వార్డులో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్. మున్సిపల్ కమిషనర్ నయుం అహ్మద్.



పొన్నూరు జూన్20( ప్రజా పాలన ప్రతినిధి) :పొన్నూరు పురపాలక సంఘం పరిధిలోని ఒకటో వార్డులో మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఎస్ ఏ నయుం అహ్మద్ ఆధ్వర్యంలో సిబ్బంది ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. వార్డులోని చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టడంతో పాటు మురుగు కాలువల్లో దోమల నివారణకు పైరోసిన్ మలాదిన్ పిచికారి చేయించారు. గృహ యజమానులు ఇంటి వ్యర్థాలను రోడ్లపై వేయకుండా మున్సిపల్ సిబ్బంది వచ్చినప్పుడు అందించాలని తెలిపారు. ప్రతి ఒక్కరు పారిశుద్ధ్యం పై అవగాహన కలిగి మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని యజమానులను కమిషనర్ నయుం కోరారు. కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ ప్రసాద్, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుమలాయపాలెం ఘటనపై మెజిస్టీరియల్ విచారణ జరిపించాలి

**జువ్వల రాంబాబు డిమాండ్**



గోకవరం ప్రజా పాలన జూన్ 20: తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలం తిరుమలాయపాలెం కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం కే. వీ .ప్ .ఎస్. రాష్ట్ర కమిటీ సభ్యులు,తూర్పు గోదావరి జిల్లా కార్యదర్శి, న్యాయవాది జువ్వల రాంబాబు తిరుమలాయపాలెం దళితపేటలో పర్యటించి గ్రామ అగ్ర కుల పెత్తందారులు,పోలీసులు కలిసి దళిత మహిళలుపై దాడిలో కాళ్ళు విరిగిన మహిళలు,లాఠీ దెబ్బలకు గాయపడిన బోయిడ మహాలక్ష్మి,సుబ్బలక్ష్మి, యువకులను పరామర్శించారు. అనంతరం దళితులు మహిళలపై పోలీసులు గ్రామ పెత్తం దారులు దాడులు.డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం తొలగింపుకు నిరసనగా అంబేద్కర్ విగ్రహం వద్ద నిరశన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ తిరుమలాయపాలెంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం తొలగింపుపై దళిత మహిళలు,యువకులు పై గ్రామపెత్తం దారులు. పోలీసులు జరిపిన దాడులుపై మెజిస్టీరియల్ దర్యాప్తు జరపాలని, డి.ఎస్.పి,సి.ఐ గోకవరం ఎస్సై ఎంఆర్ఓ లపై చర్యలు తీసుకోవాలని రాంబాబు డిమాండ్ చేశారు.ఈ ఘటనతో అగ్రకుల దురహంకారంతో దళితులను సాంఘిక బహిష్కరణ చేసి అమలు చేస్తున్నట్లు పర్యటనలో తేలిందని చెప్పారు. గ్రామంలో వైఎస్ఆర్, టీడీపీ, జనసేన పార్టీలు ఒక్కటై దళితులకు వ్యతిరేకంగా వుండటంతో దళితులు అభద్రత భావంతో వున్నారని. వెంటనే ప్రభుత్వం దళితులకు రక్షణ కల్పించి, తొలగించిన స్థానంలోనే అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్టించాలని రాంబాబు డిమాండ్ చేశారు. గాయపడిన దళితులకు వైద్య సేవలు అందించాలని, అకారణంగా దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని రాంబాబు డిమాండ్ చేశారు.ఈ పర్యటనలలో డి వై ఎఫ్ ఐ నాయకులు గారపాటి ప్రసన్న, జె జయరాజ్, శ్రీనివాస్, ఎడ్ల సుధాకర్, జె మణి కంఠ, సోమ రాజు, యువకులు పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ ఏ ఐ ఎస్ ఏ (ఐసా) జాతీయ మహాసభలు జయప్రదం చేయండి: రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.నాగరాజు




కర్నూలు ప్రజాపాలన ప్రతినిధి :ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ -(ఏఐఎస్ఏ) జిల్లా కమిటీ సమావేశం వసంత కాంప్లెక్స్ (ఏఐఎస్ఏ) కార్యాలయంలో వాల్ పోస్టర్లు విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.నాగరాజు మాట్లాడుతూ దేశంలో రెండోసారి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ భావజాలంతో దేశంలో మూఢనమ్మకాలను అశాస్త్రీయమైన విద్య విధానాన్ని పెంచి పోషించాలని ప్రభుత్వ విద్యారంగాన్ని ప్రభుత్వ కార్పోరేటర్ రంగానికి తాకట్టుపెట్టి దేశంలో విద్యా వ్యవస్థని నాశనం చేస్తూ ఉందని దేశంలో నూతన జాతీయ విద్యా విధానం తీసుకురావడం వల్ల యూజీసీ రద్దుచేసి యుజిసి స్థానంలో హైయర్ ఎడ్యుకేషన్ ఫండింగ్ ఏజెన్సీ తీసుకొచ్చి ప్రభుత్వ యూనివర్సిటీలు కళాశాలలో చదువు విద్యార్థుల దగ్గర నుంచి చలానాల రూపంలో వసూలు చేస్తూ ప్రభుత్వ విద్యా సంస్థలను ప్రైవేటు కార్పొరేట్ విద్యా సంస్థల కన్నా ఎక్కువ ఫీజులు కట్టే విధంగా చేస్తున్నారని అదేవిధంగా రాష్ట్రంలో ఉన్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బిజెపి ప్రభుత్వం తీసుకు వచ్చిన నూతన విద్యా విధానాన్ని తనపై ఉన్న కేసుల నుండి తప్పించుకోవడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమలు చేస్తూ బిజెపికి వంటపాడుతున్నారని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న విద్యార్థి వ్యతిరేక వినాలను ఖండిస్తూ రాబోవు కాలంలో ఉద్యమ నిర్మాణం కోసం ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ (ఐసా) జాతీయ మహాసభలు లిఆగస్టు 09,10,11, తేదీలలో పశ్చిమబెంగాల్ రాష్ట్ర రాజధాని కలకత్తా నగరంలోలి జరుగుతుందని ఈ మహాసభలలో దేశవ్యాప్తంగా బిజెపి ప్రభుత్వం తీసుకొస్తున్న విధానాలపై ఏ విధంగా పోరాడాలి అనే అంశాలపై చర్చించడం జరుగుతుందని ఆయన తెలిపారు అనంతరం జాతీయ మహాసభల గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నాగార్జున,అనీల్ కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి, కర్నూల్ నగర అధ్యక్షుడు పెద్దయ్య నాయకులు నాని,సాయికుమార్, రాజు పాల్గొన్నారు

## సచివాలయాలు తనిఖీ చేసిన మున్సిపల్ కమిషనర్ నయుం అహ్మద్



పొన్నూరు జూన్ ప్రజా పాలన ప్రతినిధి :పొన్నూరు పట్టణంలోని వార్డు సచివాలయాలను మంగళవారం పొన్నూరు మున్సిపల్ కమిషనర్ ఎస్ ఏ నయుం అహ్మద్ ఆకస్మిక తనిఖీ చేశారు. స్థానిక 29, 30 ,1,2 వార్డు సచివాలయాలలో రికార్డు పరిశీలించి సిబ్బంది పనితీరును సమీక్షించారు. వార్డ్ సచివాలయాల పరిధిలో ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును అడ్మిన్లను వివరణ అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నూతనంగా తలపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం నూరు శాతం అమలయ్యేలా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమయపాలన పాటించడంతోపాటు డ్రెస్ కోడ్ తప్పనిసరిగా నిర్వర్తించాలని హెచ్చరించారు. విధి నిర్వహణలో అలసత్వ వహిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట మునిసిపల్ మేనేజర్ వెంకట్రావు పాల్గొన్నారు.

## జోరు వానలో సహితం ఆగకుండా సాగిన మినీ మేనిఫెస్టో ప్రచార కార్యక్రమం



పల్నాడు జిల్లా. నరసరావుపేట. జూన్ 20 (ప్రజాపాలన ప్రతినిధి): మినీ మేనిఫెస్టో ప్రచార కార్యక్రమం నరసరావుపేట నియోజకవర్గంలో నిర్విఘ్నంగా కొనసాగుతుంది.జోరు వానను సైతం లెక్కచేయకుండా నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-ఛార్జ డా.చదలవాడ అరవింద బాబు మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు విస్తృతంగా పర్యటించారు.వైయస్ జగన్మోహన్ రెడ్డి అవలంబిస్తున్న ప్రజావ్యతిరేకత విధానాలను డా.చదలవాడ అరవింద బాబు ఇంటింటికి వెళ్లి వివరించారు.జోరు వానను సైతం లెక్క చేయకుండా విరామం లేకుండా పర్యటిస్తూ ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.మన పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే తిరిగి నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదించాలని కోరారు.జోరు వానలో సైతం ఆగకుండా డా.చదలవాడ వెంట టీడీపీ నాయకులు సికినం అమర్నాథ్,మెడబలిమి నవీన్,పాలగాని మల్లికార్జున రావు,పుచ్చకాయల బసవేశ్వర రావు,ముచ్చు వీరయ్య,చింతిల శ్రీనివాస్ రావు,ప్రభాకర్,చెన్నయ్య పర్యటించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వేల్పుల సింహాద్రి యాదవ్, మానుకొండ జాహ్నవి,కొవ్వూరి బాబు,చల్లా సుబ్బారావు,చింతిరాల బాలు,మల్లవరపు శ్యామ్,మాతంగి బంగారం ఐటీడీపీ సభ్యులు మరియు టీడీపీ నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## యోగ చేయడం అనేది వసుధైకకుటుంబముతో సమానం - పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ ఐ. ఎ. యస్.



పల్నాడు జిల్లా .నరసరావుపేట. జూన్ 20 (ప్రజాపాలన ప్రతినిధి)యోగ డే సందర్భంగా స్థానిక రోడ్డు సేఫ్టీ స్వచ్ఛంధ సంస్థ ప్రజలల్లో విస్తృతముగా అవగహన కోసమే తయారు చేసిన అంతర్జాతీయ యోగ దినోత్సవం పోస్టర్లను పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ ఐ. ఎ. యస్.ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగ అనేది ప్రతి ఒక్కరూ చేయాలి అని, యోగ చేయడం అనేది వసుధయవకుటుంభము తో సమానం అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛంధ సంస్థ అధ్యక్షులు ఆర్. కె. దుర్గ పద్మజ మాట్లాడుతూ రెండు వేల పద్నాలుగులో మన భారతప్రధాని నరేంద్ర మోదీ గారు యూనైటేడ్ నేషనల్ జనరల్ అసెంబ్లీ నందు మొట్టమొదటి సారిగా అంతర్జాతీయ యోగ దినోత్సవం నూట డేబ్బయ్ఐదు దేశాలలో ప్రతి సంవత్సరం జూన్ ఇరవై ఒకటో తేదిని అంతర్జాతీయ యోగా దినోత్సవం గా ప్రపంచ దేశాల్లో జరుపుకోవాలని ప్రతిపాధి0చి అమల్లోకి తెచ్చి యోగా డే ని జరుపుకుంటున్నారుఅని,ఈ సంవత్సరం మన భారత ప్రధాని నరేంద్ర మోదీ గారు అమెరికా దేశంలో జరుగుతున్న అంతర్జాతీయ యోగ దినోత్సవం లో పాల్గొననున్నారుఅని,భావితరాలు మంచి జీవితం కోసమే వన్ ఎర్త్, వన్ ఫ్యామిలీ, మరియు మన భవిష్యత్ అనేది ప్రామాణికం గా తీసుకుని విద్యార్థి నుండే యోగా సాధన చేయాలి అని రేపు యోగా దినోత్సవాన్ని పల్నాడు జిల్లా లింగంగుంట్ల అగ్రహారం లో గల శంకర భారతీ పురం జిల్లా పరిషత్ హైస్కూల్ నందు మా యన్. జి. ఓ నిర్వహిస్తున్నదిఅని, యోగ తో పాటు విద్యార్థిని విద్యార్థులకు "గుడ్ సమారిటేన్"పై కూడా అవగాహన కలిపిస్తాము అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో రాఘవేంద్ర చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పూనూరి కృష్ణ కుమారి సభ్యులు శౌజన్య, శ్రీ వాసవి మిత్రమండలి చైర్మన్ చేగు వెంకటేశ్వర రావు,యన్. జి. ఓ సభ్యులు కోటేశ్వరరావు, రాజ్యలక్ష్మి,వెంకటేశ్వరరావు, బంగారయ్య, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్ ప్రారంభించాలి



ఏర్పేడుప్రజా పాలన న్యూస్. శ్రీకాళహస్తిలోని ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లో ఆపరేషన్ థియేటర్ గత కొన్ని రోజులుగా మూసివేయడంతో జై భీమ్ ఆర్మీ వ్యవస్థాపకుడు పుల శ్రీకాంత్ హాస్పిటల్ లో సందర్శించి సూపర్డెంట్ విజయలక్ష్మిని కలవడం జరిగింది. శ్రీకాంత్ మాట్లాడుతూ ఆపరేషన్ థియేటర్ త్వరలోనే ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరారు. హాస్పిటల్ లోని నూతన భవన నిర్మాణం కారణంగా దుమ్ము రావడంతో హాస్పిటల్ థియేటర్ మూసివేయడం జరిగిందని సూపర్డెంట్ విజయలక్ష్మి తెలియజేశారు. ఈ సందర్శన సందర్భంగా శ్రీకాళహస్తి పట్టణ జై భీమ్ అధ్యక్షులు కన్నలి రమేష్, కుంపటి చలపతి, సాధు భాస్కర్ మొదలగు జై భీమ్ సభ్యులు పాల్గొన్నారు.

## నియోజకవర్గంలో గెలుపే లక్ష్యంగా పని చేయండి



పల్నాడు జిల్లా నరసరావుపేట జూన్ 20.(ప్రజాపాలన ప్రతినిధి): నరసరావుపేట నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ విజయమే లక్ష్యంగా ఐటీడీపీ నాయకులు కృషి చేయాలని నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-ఛార్జ డా.చదలవాడ అరవింద బాబు పిలుపునిచ్చారు. నరసరావుపేట మండలం ఇక్కుర్తి గ్రామానికి చెందిన విజయలక్ష్మి ఐ టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎంపికయ్యారు.ఈ సందర్భంగా మంగళవారం పార్టీ కార్యాలయంలో నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-ఛార్జ్ డా.చదలవాడ అరవింద బాబును విజయలక్ష్మి మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా డా.చదలవాడ మాట్లాడుతూ నియోజకవర్గంలోని పార్టీ కార్యక్రమాలు,వైసీపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేకత తీరును సోషల్ మీడియాలో చొచ్చుకుపోయేలా పని చేయాలని సూచించారు.విజయలక్ష్మి మాట్లాడుతూ ఐటీడీపీ బాధ్యతలు అప్పగించడమే కాకుండా అనునిత్యం ప్రోత్సహించిన నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-ఛార్జ డా.చదలవాడ అరవింద బాబుకి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ బొడ్డపాటి పెరయ్య,కూరపాటి పెద్ద శీను,కూరపాటి చిన్న శీను,కనుమూరి రమేష్,కడియం కోటి సుబ్బారావు,ఊడతా రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ముసురు మల్లి ప్రాజెక్టుకు గేట్లు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోండి

**జాస్మిన్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ బత్తిన రామకృష్ణ**



గోకవరం ప్రజా పాలన జూన్ 20: ప్రియతమా దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి గారు రైతు బాంధవుడుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి తొలిసారి తూర్పుగోదావరి జిల్లా అప్పటి బూరుగుపూడి నియోజకవర్గ గోకవరం మండలం పర్యటనకు విచ్చేసి గోకవరం మండలంలో ఉన్న రైతుల కోరిక అప్పటి బూరుగుపూడి శాసనసభ్యులు చిట్టురి రవీంద్ర ద్వారా దివంగత ముఖ్య మంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన అప్పటి ముఖ్యమంత్రి అప్పటికప్పుడు ముసిరిమెల్లి ప్రాజెక్ట్ మంజూరు చేస్తూ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.ఆ ముసిరిమెల్లి ప్రాజెక్టు వల్ల సుమారు 24 వేల ఎకరాల వరకు సాగు త్రాగునీరు అందుతుంది. దేవీపట్నం గోకవరం మండలాన్ని సస్యశ్యామలం చేయడానికి దోహదపడే ఆ ప్రాజెక్టు పన్నెండు సంవత్సరాలు దాటిన పూర్తి మస్థాయిలో నిర్మాణం జరగలేదు దయచేసి ఇప్పటికైనా మన నాయకులు ముసిరిమెల్లి ప్రాజెక్టుకు గేట్లు ఏర్పాటు చేసి ఈ సీజన్ లో అయినా రైతులకు నీరు అందించే కార్యక్రమం చేపట్టాలని గోకవరం మండల రైతులు ఆశపడి ఎదురు చూస్తున్నారు. తక్షణం స్థానిక ప్రజాప్రతినిధులు అంతా ముసిరిమెల్లి ప్రాజెక్టు గేట్లు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని జాస్మిన్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ రామకృష్ణ కోరుతున్నారు.

## పొన్నూరులో వాహనాల తనిఖీ



పొన్నూరు జూన్20( ప్రజా పాలన ప్రతినిధి) :పొన్నూరు పట్టణంలో మంగళవారం అర్బన్ సీఐ ఎం. బాబీ ఆధ్వర్యంలో గాంధీ బొమ్మ సెంటర్, అంబేద్కర్ సెంటర్ల లో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఎటువంటి లైసెన్స్ లేని వాహనాలు తనిఖీ చేయటంతో పాటు గతంలో 'ఈ' చలానా ద్వారా పెనాల్టీ వేసిన వాహనాలను తనిఖీ చేశారు. తక్షణమే 'ఈ' చలానా చెల్లించాలని సిఐ ఎం. బాబి వాహన చోదకులను హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని హెచ్చరించారు. ఎస్సై లు హసీమ్, రామబ్రహ్మం తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## కెటి రోడ్ లో( తమ్మిన పోతరాజు రోడ్డు) బస్సుల పునరుద్ధరణకు ధన్యవాదాలు

**సిపిఐ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు**



విజయవాడ ప్రజాపాలన ప్రతినిధి: : కెటీ రోడ్డులో మిల్క్ ప్రాజెక్టు నుండి చిట్టి నగర్ మీదుగా కాలేశ్వరరావు మార్కెట్ కు బస్సులు అనుమతించి నందుకు అధికారులకు సిపిఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు ధన్యవాదములు తెలియజేశారు. విజయవాడ కొత్తపేట కెటి రోడ్డు నిర్మాణ పనుల నిమిత్తం సుమారు రెండు సంవత్సరాలుగా ప్రయాణికులకు, వాహనదారులకు, పాదచారులకు ఇబ్బందుల నుంచి ఉపశమనం కోసం పూర్తయిన ఒకవైపు రోడ్డులో బస్సులను పునరుద్ధరించాలని భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో గణపతిరావు రోడ్డు చేపల మార్కెట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టగా మున్సిపల్, ఆర్టీసి అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి, పనులు వేగవంతం చేసి, బస్సులు పునరుద్ధరించినందుకు భారత కమ్యూనిస్టు పార్టీ విజయవాడ నగర సమితి తరపున ధన్యవాదములు.

## లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

జంగారెడ్డిగూడెం ప్రజాపాలన ప్రతినిధి: లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం




ఏకగ్రీవంగా ఎన్నికయింది. క్లబ్ నూతన అధ్యక్షుడిగా కన్నం హనుమంతరావు, కార్యదర్శిగా కొండపల్లి పండు, కోశాధికారిగా కాకర్ల వీరభద్రరావు, ఎన్నికయ్యారు. క్లబ్ అడ్మినిస్ట్రేటర్ గా ప0తగాని వెంకన్న వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు అట్లూరి సురేష్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని అభినందించారు. జోన్ చైర్మన్ పంతగాని వెంకన్న, డీసీలు మద్దిపాటి నాగేశ్వరరావు, అట్లూరి సురేష్, ఉక్కుర్తి సీతారాములు మాట్లాడుతూ సేవా రంగంలో అంతర్జాతీయంగా లైన్స్ క్లబ్ కు విశిష్ట స్థానం ఉందన్నారు. ఆపన్నులకు అభయ హస్తం అందించేందుకు లయన్ సేవా తత్పరులు ఎల్లవేళలా ముందంజలో ఉంటారు అన్నారు. నూతన కార్యవర్గం సమాజానికి అవసరమైన సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో జంగారెడ్డిగూడెం లైన్స్ క్లబ్ ను అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ప్రస్తుత అధ్యక్షుడు భవిరిశెట్టి మురళి, కార్యదర్శి నంబూరి రామచంద్ర రాజు, కోశాధికారి కొండపల్లి పండు, నాయకులు దాసరి శేషు కుమార్, నంగులూరి జగత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రహదారి ఏర్పాటు చెయ్యాలి: ఎఐఆర్ యస్ ఓ డిమాండ్

పాములపాడు ప్రజాపాలన ప్రతినిధి: గ్రామంలోని ప్రభుత్వ జూనియర్




కళాశాలకు సరైన రహదారి లేకపోవడంతో విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు జూనియర్ కళాశాలకు వెళ్ళాలంటే ఇబ్బందులు పడుతున్నారని ఎఐఆర్ యస్ ఓ జిల్లా సహాయ కార్యదర్శి పిచ్చికే లోకేష్ ఆరోపించారు అనంతరం పాములపాడు గ్రామం లో వున్న జూనియర్ కళాశాలను సందర్శించిన అనంతరం లోకేష్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో అఖిల భారత విప్లవ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు ఇక్కడ వున్న రహదారి లేకపోవడంతో విద్యార్థులు వర్షం పడితే ఇంకా ఎంత దారుణంగా ఉంటుందోనని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు ఇకనైనా అధికారులు నాయకులు తక్షణమే స్పందించి జూనియర్ కళాశాలకు సరైన రహదారి కల్పించాలని వారు డిమాండ్ చేశారు.



**చేబ్రోలు మండల విద్యాశాఖాధి కారి(2) రాయల సుబ్బారావు ను ఘనంగా సన్మానించిన సంఘ రాష్ట్ర నాయుకులు శ్రీ జోసెఫ్ సుధీర్ బాబు, ఎపిటిఎఫ్ (1938) గుంటూరు జిల్లా ప్రదాన కార్యదర్శి మేకల సుబ్బారావు, జిల్లా నాయుకులు శ్రీ గురజాల శ్రీనివాసరావు తదితరులు**

## వర్షాలు వస్తున్నాయి.. రాష్ట్రంలో రోడ్లు వేయకపోయినా పర్వాలేదు గోతులైన పూడ్చండి.. ప్రజల ప్రాణాలు కాపాడండి: సోలంకి రాజు జైన్



ఎన్టీఆర్ జిల్లా ప్రజాపాలన ప్రతినిధి: విజయవాడ పశ్చిమ నియోజకవర్గం. తెలుగుదేశం పార్టీ ఎన్టీఆర్ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు సోలంకి రాజు జైన్. ఓ పత్రిక ప్రకటించడం ద్వారా .రాష్ట్రం ముఖ్యమంత్రి గారికి .రోడ్లకు సంబంధించిన మంత్రికి ఒక విన్నతి.. గత నాలుగు సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోని ఆంధ్రప్రదేశ్లో రోడ్ల పై దృష్టి పెట్టి.. మిమ్మలను నమ్ముకొని ఓట్లు వేసి నటువంటి .ఆంధ్రరాష్ట్ర ప్రజలు కాళ్లు చేతులు కోతుల్లో పడి యాక్సిడెంట్ హాస్పిటల్ పాలు కాకముందే.. ప్రజల ప్రాణాలు కాపాడవలసిందిగా. టిడిపి పార్టీ తరపున కోరుతున్నాం ..అతి కొద్ది రోజుల్లో వర్షాకాలం వస్తుంది రాష్ట్ర ప్రజలపై. ప్రేమ ఉన్న లేకపోయినా. ముందు జాగ్రత్త చరిగా. ఆంధ్రరాష్ట్ర ప్రజల ప్రాణాలను కాపాడవలసిన బాధ్యత అధికార రాష్ట్ర ప్రభుత్వం పై.. మరియు సంబంధిత అధికారులపై కచ్చితంగా ఉందని తెలియజేస్తున్నాను.. కాబట్టి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారికి మరియు సంబంధిత అధికారులు. రాష్ట్రంలో గోతులు పడిన రోడ్లపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి.. అతి కొత్త రోజుల్లో రాష్ట్రంలో రానున్న వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని.. నగరాల్లో మండలాల్లో పల్లెటూర్లో గోతులు మాయమైన రోడ్లను బాగు చేయపోయినా పర్వాలేదు.. రోడ్లు పై ఉన్న గోతులు అయినా పూర్చోండి...... అలాగే రాష్ట్ర మంత్రులు. రైతులు పండించే పంట పొలాలపై ముందు జాగ్రత్త చరిగా. రైతన్నలు నష్టపోకుండా ఉండే విధంగా చర్యలు తీసుకోండి. విజయవాడ పశ్చిమ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు.. సోలంకి రాజు జైన్. ప్రభుత్వానికి. మంత్రులకి. ప్రభుత్వాధికారులకు తెలియజేస్తున్నారు.

## కనిగిరి మున్సిపల్ వైస్ చైర్మన్ పులి శాంతికి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ప్రశంస



కనిగిరి :ప్రజాపాలన ప్రతినిధి: సీఎం జగన్ ప్రవేశపెట్టిన క్లాప్ ప్రోగ్రాం (క్లీన్ ఆంధ్ర ప్రదేశ్) కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ వైస్ చైర్మన్ పులి శాంతి కౌన్సిలర్ గా ప్రాతినిధ్యం వహిస్తున్న కనిగిరి పట్టణంలోని 18 వ వార్డు ను ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దేందుకు చేస్తున్న ప్రయత్నాలను స్వయంగా తెలుసుకున్న జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. గతంలో 18 వ వార్డులో క్లాప్ ప్రోగ్రాం ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఈ కార్యక్రమానికి సంబంధించి ప్రత్యేక డాక్యుమెంటరీని రూపొందించి వీడియో రూపంలో తనకు అందజేయమని వైస్ చైర్మన్ పులి శాంతిని కోరగా, ఆ మేరకు డాక్యుమెంటరీని రూపొందించిన పులి శాంతి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ను ఒంగోలు కలెక్టరేట్ లో కలిసి డాక్యుమెంటరీని చూపించారు. డాక్యుమెంటరీని వీక్షించిన జిల్లా కలెక్టర్ ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. చెత్తను వేరు చేసే పద్ధతిని ప్రజలకు వివరించడమే కాకుండా, 18 వ వార్డును పరిశుభ్రమైన వార్డుగా, ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు వైస్ చైర్మన్ శాంతి చేస్తున్న కృషిని ప్రశంసించడమే కాకుండా, క్లాప్ ప్రోగ్రాం ను మరింత ముందుకు తీసుకువెళ్లాలని, అన్ని విధాల తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని కలెక్టర్ భరోసా ఇచ్చారు.

## హైవే పై వాహనాలు మృత్యు శకటాలు: కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్



కనిగిరి : ప్రజాపాలన ప్రతినిధి: కనిగిరి ప్రాంతంలో నేషనల్ హైవే రహదారి గోతులమయంగా తయారై తరచూ రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న కనిగిరి– పామూరు జాతీయ రహదారిని హెరిటేజ్ పాల డైరీ వద్ద సోమవారం సమస్య– పరిష్కారం కార్యక్రమంలో భాగంగా కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ స్థానిక కౌన్సిలర్ తమ్మినేని సుజాత తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా జాతీయ రహదారి గోతులతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులతో మున్సిపల్ చైర్మన్ స్వయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ కనిగిరి– పామూరు జాతీయ రహదారి గోతులమయంగా మారి వాహనదారుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి అన్నారు . ఈ వారం రోజుల వ్యవధిలో ముగ్గురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు. గతంలో ఎమ్మెల్యే మధుసూదన్ యాదవ్ ద్వారా సమస్యను హైవే అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి వారి ద్వారా సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తున్నప్పటికీ హైవే అధికారులు తాస్కారం చేస్తున్నారన్నారు. ప్రాణాలు పోతున్నా హైవే అధికారులు పట్టించుకోరా? అని మున్సిపల్ చైర్మన్ ప్రశ్నించారు . ఈసారి జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదానికి గురై ఎవరైనా మరణిస్తే డైరెక్ట్ గా హైవే అథారిటీ వారి పైనే ఇన్సూరెన్స్ కోసం క్లైమ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ తమ్మినేని సుజాత వైసిపి నాయకులు శ్రీరాములు రెడ్డి, అచ్చాల శ్రీను, సుబ్బారెడ్డి, భూమిరెడ్డి రమణారెడ్డి ఉమా శంకర్ రెడ్డి, మని ప్రసాద్ రెడ్డి,మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

## మా ఉద్యోగాలు మాకు ఇప్పించండి



రైల్వే కోడూరు ప్రజాపాలన ప్రతినిధి: :అన్నమయ్య జిల్లా ఓబులవారి పల్లి మండలం లోని మంగంపేటలో ఈరోజు ఉదయం ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ మంగంపేట బెరైటీస్ మైన్స్ విస్తీర్ణం కొరకు మా ఇండ్లను ఏపీఎండిసి యాజమాన్యం 2006వ సంవత్సరంలో తొలగించడం జరిగింది. ఆనాడు అధికారులు మా ఇళ్లను తొలగించినందుకు ఉద్యోగాలు ఇస్తామని తెలిపారు ఆ మాటకు గౌరవం ఇచ్చి మా ఇళ్లను తొలగించడం జరిగింది. తర్వాత మాకు ఉద్యోగాలు ఇవ్వకుండా మా కన్నా వెనక ఇండ్లను తొలగించిన వారికి ఉద్యోగాలు కల్పించారు అనేక సంవత్సరములు అధికారులకు రాజకీయ నాయకులకు మా బాధను చెప్పిన పట్టించుకోలేదు ఇప్పుడు వచ్చిన వైస్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ మా బాధను గుర్తించి ఒక కమిటీ వేసి మేము ఎటువంటి ఉద్యోగాలు గాని ప్యాకేజ్ గాని తీసుకోలేదు అని తేలిన తర్వాత నందు 19 ఉద్యోగాలు బోర్డులో పెట్టి పాస్ చేయడం జరిగింది 22,02,2022 డైరెక్టర్ మాకు 19 మందికి ఉద్యోగాలు ఇస్తూ మంగపేట బ్రాంచ్ కి ఉత్తర్వులు పంపించారు మేము ఉద్యోగాలు చేరుటకు వస్తే కొంతమంది మా ఉద్యోగాలను అడ్డుకున్నారని వైస్ చైర్మన్ అండ్ మేనేజర్ ఆర్డర్ ను ఓల్డ్ లో పెట్టాలని ఆర్డర్స్ పంపించారని తెలిసి తెలిసి మేము చాలా బాధపడ్డాం మా నాయకులను తీసుకొని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు వారి వద్దకు వెళ్లిన వెంటనే ఆపిన ఉద్యోగాలు తిరిగి ఇవ్వమని అధికారులకు ఆదేశించారు అయినా ఆదేశాలు ఇచ్చిన ఫలితం కనపడుతుంటే మరోసారి ముఖ్యమంత్రి గారి వద్దకు వెళ్ళగా వారు అధికారులు మందలించి వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని గట్టిగా చెప్పారు అయినా ఇంతవరకు ఏపిఎంటిసి వైస్ చైర్మన్ మేనేజ్ డైరెక్టర్ 22 మందికి ఉద్యోగాలు పదిమందికి పేజి ప్యాకేజీ ఇవ్వలేదు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చెప్పిన ఉద్యోగాలు ఇవ్వలేదు కావున మేము 196 2023 గాంధీ మార్గంలో శాంతియుతంగా ఎపిఎండీసీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్ ముందు ఒక్కరోజు ధర్నా చేపట్టాం ఇప్పటికైనా అధికారులు మాపై దయవుంచి మా ఉద్యోగాలు మాకు ఇవ్వమని వేడుకుంటున్నాం

## ఎమ్మెల్యేల్లో సమీక్ష టెన్షన్

గుంటూరు, జూన్ 20, :ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జూన్ 21న 'గడప గడపకూ మన ప్రభుత్వం' ప్రజా సంప్రదింపు కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ ఎమ్మెల్యేల పనితీరును సమీక్షించనున్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ టిక్కెట్లు కోరుతున్న ఎమ్మెల్యేలకు ఈ సమీక్ష అగ్నిపరీక్షలా మారనుంది. ప్రతి మూడు నెలలకోసారి వైఎస్సార్‌సీపీ శాసనసభ్యుల పనితీరుపై సీఎం ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఫలితంగా, దాదాపు 30–40 మంది ఎమ్మెల్యేలు పేలవమైన పనితీరు కనబరిచిన వారిగా గుర్తించబడ్డారు. వారి పనితీరుకు సంబంధించిన పరిణామాలను ఎదుర్కోవలసి ఉంటుంది. వచ్చే ఎన్నికల్లో గెలుపు గుర్రాలకే టిక్కెట్లు ఇస్తామని సీఎం జగన్ ఇప్పటికే స్పష్టం చేశారు. మంచి పనితీరు యొక్క ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు, వైయస్ఆర్ కాంగ్రెస్ టిక్కెట్‌పై పోటీ చేసే ప్రతి ఒక్కరూ విజయం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అలాగే, జూన్ 23న ప్రారంభం కానున్న జగనన్న సురక్ష జనబాట కార్యక్రమానికి సంబంధించి పార్టీ సభ్యులకు ముఖ్యమంత్రి సూచనలు చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సాధారణ ఎన్నికల షెడ్యూల్‌ను అనుసరిస్తామని సీఎం జగన్ చెప్పడం ద్వారా ముందస్తు ఎన్నికల ఊహాగానాలకు తెరపడటం గమనార్హం. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు తమ పనితీరును మెరుగుపరుచుకునేందుకు రానున్న 10 నెలల సమయాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. తెలుగుదేశంలోకి విధేయులుగా మారిన నలుగురు సస్పెన్షన్ ఎమ్మెల్యేల స్థానంలో నలుగురు నేతలను నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లుగా జగన్ రెడ్డి నియమించారు. మార్చి నెలాఖరులో జరిగిన పార్టీ వర్క్‌షాప్‌లో, పనితీరులో మెరుగైన పనితీరు కనబరిచిన ఎమ్మెల్యేల పేర్లను, అలాగే పేలవమైన పనితీరును కనబరిచిన వారి పేర్లను సీఎం జగన్ వెల్లడించారు. 30–40 మంది ఉన్న పేలవమైన ప్రదర్శనకారులకు జూన్ 21న జరగనున్న తదుపరి సమావేశానికి ముందు కష్టపడి పనిచేసి మెరుగుపరచుకోవాలని నిర్దేశించారు. 175 నియోజకవర్గాలపై సమగ్ర సర్వే నివేదికలు, క్షేత్రస్థాయి పరిస్థితులపై విలువైన అవగాహన కల్పిస్తూ సీఎంకు ఇటీవలే నివేదికలు అందాయి. గత ఏడాది మే 11న గడప గడపకూ మన ప్రభుత్వం ప్రజా సంప్రదింపు కార్యక్రమాన్ని ప్రారంభించినప్పటి నుంచి ప్రతి నెలా కనీసం 16 నుంచి 21 రోజులపాటు ప్రజలతో మమేకం కావాలని మంత్రులు, ఎమ్మెల్యేలను సీఎం జగన్ కోరారు. ప్రజాప్రతినిధులను ప్రజలకు చేరువ కావడంతోపాటు వారి సమస్యలను పరిష్కరించడం ఈ కార్యక్రమం లక్ష్యం. దాదాపు 80% మంది శాసనసభ్యులు తమ పనితీరులో మెరుగుదల కనబరిచినప్పటికీ, మిగిలిన 20% మందిలో గుర్తించదగిన మార్పు లేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మార్పు కనిపించని వారి విషయంలో సీఎం జగన్ కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నారు.

## రాయలసీమ కోసం న్యాయ పోరాటం




తిరుపతి, జూన్ 20, : రాయలసీమకు జరుగుతున్న అన్యాయంపై జులై నెలలో ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాయలసీమ స్టీరింగ్ కమిటీ అధ్యక్షులు బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి ప్రకటించారు. ఆదివారం కడపలో నిర్వహించిన రాయలసీమ స్టీరింగ్ కమిటీ విస్తృత సమావేశానికి బైరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సమావేశంలో రాయలసీమలోని నాలుగు ఉమ్మడి జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ అనాధిగా వివక్షకు గురవుతూనే ఉందన్నారు. అప్పటి పాలకుల నుంచి ఇప్పటి పాలకుల వరకూ ఏ ఒక్కరూ రాయలసీమను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. రాయలసీమలో జరుగుతున్న అన్యాయంపై ఢిల్లీలోనే పోరు నిర్వహించేందుకు జులై నెలలో ఛలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రత్యేక రాయలసీమ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ రాయలసీమ వ్యాప్తంగా 3.5 లక్షల మంది సంతకాల సేకరణ చేపట్టామన్నారు. మలి విడత సంతకాల సేకరణ సోమవారం నుంచి ప్రారంభిస్తున్నామన్నారు. రాయలసీమ ఇప్పటికే ఎన్నో ఎదురు దెబ్బలు తినిందన్నారు. ప్రత్యేక రాయలసీమ కోసం అనువుగా ఉన్న అన్ని అవకాశాలనూ సద్వినియోగం చేసుకుంటామన్నారు. 1951లో కృష్ణా –పెన్నార్ ప్రాజెక్టు నిర్మాణం జరిగి ఉంటే రాయలసీమలో కరువు ఉండేది కాదన్నారు. 1956లో కర్నూలు రాజధానిని పోగొట్టుకుని రాయలసీమ మరోసారి దెబ్బతిందన్నారు. రాయలసీమ నడిగడ్డ హోస్పేటను వదులుకున్నామన్నారు. రాయలసీమకు దెబ్బమీద దెబ్బలు పడుతూనే ఉన్నాయన్నారు. సిద్దేశ్వరం వద్ద బ్రిడ్జి కం బ్యారేజీ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. తద్వారా 60 టి.ఎం.సిల నీరు నిల్వ చేస్తే రాయలసీమ ప్రాంతానికి సాగు, తాగునీరు అంది సస్యశ్యామలం అవుతుందన్నారు. ప్రభుత్వం మాత్రం తీగెల వంతన కడుతామని చెపుతోందని, దాని వల్ల రాయలసీమ దరిద్రం పోతుందా అని బైరెడ్డి ప్రశ్నించారు. అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణం వల్ల మూడు రాష్ట్రాల్లోని 8 జిల్లాలు పూర్తిగా నష్టపోతాయని బైరెడ్డి తెలిపారు.. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి అప్పర్ భద్రను ఆపితే పులివెందులకు కూడా నీళ్లివ్వొచ్చన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కర్నాటకలో అక్రమ ప్రాజెక్టులు నిర్మిస్తున్నారన్నారు. దీని వల్ల నష్టపోయేది ముందుగా రాయలసీమ ప్రాంతమేనని ఆయన పేర్కొన్నారు. హోస్పేట్ డ్యాంలోనీ నీరు స్మగ్లింగ్ జరుగుతోందన్నారు. 69 జీ.ఓను రద్దు చేయాలని తాము డిమాండ్ చేస్తున్నామన్నారు. రాయలసీమలో అన్నమయ్య ప్రాజెక్టు, అలగనూరు రిజర్వాయర్, పోతిరెడ్డి పాడు హెడ్ రెగ్యులేటర్ గేట్లు పాడై ఏళ్లు గడుస్తున్నా చర్యలు శూన్యమని బైరెడ్డి మండిపడ్డారు. ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డికి నాలుగేళ్లు ఢిల్లీకి వెళ్లేందుకే సమయం సరిపోతోందన్నారు. ఇంత దద్దమ్మ ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదన్నారు. రాయలసీమ నాశనం చేసింది, చేస్తోంది సినీమావాళ్లేనన్నారు. రాయలసీమపై లేని పోనివి చూపించి రక్తపాతమంటూ ప్రచారాలు ఊదరగొట్టి రాయలసీమకు పెట్టుబడులు రాకుండా చేస్తోంది వాళ్లేనని చెప్పారు. ఖనిజాలకు ఆలవాలం, వర్షానికే వజ్రాలను అందించే గొప్ప పుణ్యనేల రాయలసీమ అని బైరెడ్డి పేర్కొన్నారు



# పవన్ "ఓజీ" పై ఇంట్రెస్టింగ్ న్యూస్.!






పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా చేస్తున్న లేటెస్ట్ చిత్రాల్లో అయితే యంగ్ అండ్ టాలెంటెడ్ దర్శకుడు సుజీత్ తెరకెక్కిస్తున్న పవర్ ఫుల్ యాక్షన్ డ్రామా "ఓజీ" కోసం తెలిసిందే.. మరి ఈ సినిమాపై క్రేజీ హైప్ నెలకొనగా ఈ సినిమా క్యాస్టింగ్ పరంగా కూడా ఆడియెన్స్ లో మరింత ఆసక్తి రేపింది. ఇక ఈ సాలిడ్ ప్రాజెక్ట్ విషయంలో అయితే కొన్ని ఇంట్రెస్టింగ్ వార్తలు మెగా కాంపౌండ్ నుంచి తెలుస్తున్నాయి. ఈ చిత్రం పవన్ రోల్ గాంధీ అనే పేరుతో కనిపిస్తుంది అని తెలుస్తుంది. అలాగే నటి శ్రీయ రెడ్డి కి సుజీత్ ఒక పవర్ ఫుల్ పాత్రని అయితే డిజైన్ చేసాడట. పవన్ కి ఒక అన్న పాత్ర ఉంటే శ్రీయ పవన్ వదినగా కనిపించనున్నారని సమాచారం. దీనితో అయితే ఓజి ని సుజీత్ పర్ఫెక్ట్ గా ప్లాన్ చేస్తున్నాడని చెప్పాలి. ఇక ఈ చిత్రానికి అయితే థమన్ సంగీతం అందిస్తుండగా ప్రియాంక మోహన్ హీరోయిన్ గా అర్జున్ దాస్ ఒక కీలక పాత్రలో అయితే నటిస్తున్నాడు. అలాగే డీవీవీ ఎంటర్టైన్మెంట్స్ వారు నిర్మాణం వహిస్తున్న సంగతి తెలిసిందే.

# ఆటోరిక్షాలో హీరోయిన్ జర్నీ...ఇంట్లో కార్లు లేవా?







ఇప్పుడేదైనా రొటీన్ కి భిన్నంగా చేయాలి. అప్పుడే మైలేజ్ వచ్చేది. నలుగురుకి తెలిసేది. పోటీ ప్రపంచంలో ఎంతో ఇన్నోవేటివ్ గా వెళ్తే! అంతకంతకు వెలుగులోకి వస్తాం. రోటీన్ గా చేస్తే ఎవరు చూస్తారు? అందుకే దానికి భిన్నంగా వెళ్తేనే జనాల్లోకి వెళ్లేది అనేది కొందరి లెక్క.సరిగ్గా బాలీవుడ్ బ్యూటీ శ్రద్ధాకపూర్ ఇప్పుడు అలాంటి పనొకటి చేసింది. ఇంట్లో కోట్ల రూపాయల ఖరీదైన కార్లు ఉన్నా! అమ్మడు ఆటోరిక్షాలో జిమ్ కి వెళ్లింది. మూతికి మాస్క్ ధరించి సాధారణ దుస్తుల్లో అభిమానులకు హాయ్ చెబుతూ ఇలా జుహూ ఏరియాలో కనిపించింది.ఆటోలో వచ్చానని సిగ్గు..మొహమాటం లాంటివి పడలేదు. ఈ రకంగా తనలో డౌన్ టు ఎర్త్ క్వాలిటీని బయట పెట్టింది. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట వైరల్ గా మారింది. అభిమానులు ఏంటి ఇలా ఆటోలో వచ్చింది? అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.ఇంట్లో కార్లు అన్నీ ఏమయ్యాయి? లేక కావాలనే ఆటోలో వచ్చిందా? అంటూ ప్రశ్నిస్తున్నారు. బహుశా శ్రద్ధా కపూర్ ఇలా ఆటో ఎక్కడం ఇదే తొలిసారేమో. ఆటో ఎక్స్ పీరియన్స్ ఎలా ఉందంటూ! అడుగుతున్నారు. హీరోయిన్లే కాదు అప్పుడప్పుడు స్టార్ హీరోలు సైతం ఇలా ఆర్టీసీ బస్సులు..ఆటో జర్నీలు మఫ్టీలో చేస్తుంటారు.ఎవరూ గుర్తు పట్టకుండా ముఖాన్ని మాస్కులతో..స్కాప్ లతో కవర్ చేసి సాధారణ జనాల్లో కలిసి ప్రయాణిస్తుంటారు. బాలీవుడ్ హీరోలు ఇలాంటి ఫీట్లు ఎక్కువగా చేస్తుంటారు. ఆ మధ్య రాంగోపాల్ వర్మ కూడా ఇలాగే ఎవరూ గుర్తుపట్టకుండా బైక్ పై మూసాపేట థియేటర్ కి సినిమాకెళ్లి వచ్చారు. ఆ సమయంలో ముసుగు గాలికి ఎగిరిపోవడంతో వర్మ అని గుర్తించి అతని వైపు పరుగులు తీయబోయారు.ఆ తర్వాత సాయి పల్లవి కూడా స్కాప్ ధరించి ఓ మాల్ లో సాధారణ ప్రేక్షకుడిలా సినిమా చూసొచ్చింది. అంతకు ముందు బాలీవుడ్ బిగ్ బీ అమితాబచ్చన్ కూడా గుర్తు పట్టకుండా ముంబై వీధుల్లో షికార్లు చేసిన సందర్భాలున్నాయి. అలాగే అమీర్ ఖాన్ కి కూడా ఇలాంటి ఆస్వాదన అంటే ఎంతో ఇష్టం.

# కమల్ హాసన్

# 'భారతీయుడు - 2' ఇంట్రెస్టింగ్ అప్ డేట్




లోకనాయకుడు కమల్ హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియన్ మూవీ భారతీయుడు 2. కొన్నేళ్ల క్రితం రిలీజ్ అయి బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం అందుకున్న భారతీయుడు మూవీ కి సీక్వెల్ గా ఇది తెరకెక్కుతోంది. కాజల్ అగర్వాల్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ మూవీలో రకుల్ ప్రీత్ సింగ్, సిద్దార్థ, ప్రియా భవాని శంకర్, గుల్షన్ గ్రోవర్, సముద్రఖని, బాబీ సింహా తదితరులు కీలక పాత్రలు చేస్తున్నారు. అనిరుద్ సంగీతం అందిస్తున్న ఈ మూవీ ని లైకా ప్రొడక్షన్స్, రెడ్ జెయింట్ మూవీస్ సంస్థలు గ్రాండ్ లెవెల్లో నిర్మిస్తున్నాయి.మొదటి నుండి అందరిలో భారీ అంచనాలు ఏర్పరిచిన ఈ మూవీ యొక్క షూటింగ్ ప్రస్తుతం వేగంగా జరుగుతోంది. విషయం ఏమిటంటే, తాజా సమాచారం ప్రకారం జూన్ నెలాఖరు నాటికి ఈ సినిమా షూటింగ్ మొత్తం పూర్తయ్యే అవకాశం ఉందట. ఈలోగా డబ్బింగ్, ఇతర పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే ఈ సినిమాలో భాగమైన సిద్దార్థ్ తన పాత్రకు డబ్బింగ్ చెప్పడం ప్రారంభించినట్లు ప్రకటించాడు. మొత్తంగా దీనిని బట్టి చూస్తుంటే వీలైనంత త్వరలోనే భారతీయుడు 2 ఆడియన్స్ ముందుకి వచ్చే అవకాశం కనపడుతోంది.

# మెగా ప్రిన్సెస్ కి చిరు.. పవన్‌ల '2' సెంటిమెంట్




మెగాస్టార్ చిరంజీవి మరోమారు తాత అయ్యారు. మెగా ఫ్యామిలీలో మూడవ తరం అడుగు పెట్టడంతో మెగా ఫ్యాన్స్ అంతా కూడా చాలా సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. అర్ధరాత్రి 1:49 కి చరణ్ - ఉపాసన దంపతుల పాప జన్మించింది. పాప జన్మించిన విషయాన్ని తెల్లవారు జామున మెగా ఫ్యామిలీ అధికారికంగా ప్రకటించారు. మెగాస్టార్ చిరంజీవి ఈ విషయమై స్పందిస్తూ.. లిటిల్ మెగా ప్రిన్సెస్ కి స్వాగతం. మీరు ఆశీర్వదించినట్లుగా రామ్ చరణ్ మరియు ఉపాసనలు నన్ను మరోసారి తాతను చేశారు. పాప రాకతో మిలియన్ ల మంది మెగా కుటుంబంతో ఆనందాన్ని పంచుకున్నారు. చాలా సంతోషంగా గర్వంగా ఉందని చిరు ట్వీట్ చేశాడు.అంతే కాకుండా చిరంజీవి ఒక ప్రెస్ నోట్ ను విడుదల చేయడం జరిగింది. అందులో మాకు ఇష్టమైన మంగళవారం నాడు బిడ్డ పుట్టడం ఆనందంగా ఉందని పేర్కొన్నాడు. అంతే కాకుండా పాప శుభ ముహూర్తంలో జన్మించింది.. శిశువు జాతకం అద్భుతంగా ఉందని పేర్కొన్నాడు. ఆ ప్రభావం తప్పకుం డా ముందు ముందు మా ఫ్యామిలీ లో కనిపించబోతుందని చిరు తన ఆనందాన్ని షేర్ చేశారు.ఇక చిరంజీవి పుట్టిన రోజు ఆగస్టు 22 మరియు పవన్ కళ్యాణ్ యొక్క పుట్టిన రోజు సెప్టెంబర్ 2. ఇద్దరు తాతల యొక్క పుట్టిన రోజు రెండు తో ముడిపడి ఉంది. కనుక జూన్ 20న పుట్టిన మెగా ప్రిన్సెస్ తప్పకుం డా గొప్ప జాతకురాలు అవ్వబోతుం ది అంటూ మెగా ఫ్యాన్స్ రెండు సెంటిమెంట్ ను నమ్ముతున్నారు.

# తన క్రేజీ హిట్ డైరెక్టర్ తో మరోసారి అజిత్.?



కోలీవుడ్ స్టార్ హీరో థలా అజిత్ కుమార్ హీరోగా నటించిన రీసెంట్ చిత్రం తెగింపు తమిళ నాట భారీ హిట్ అయ్యిన సంగతి తెలిసిందే. మరి ఈ చిత్రం రిలీజ్ తర్వాత మళ్ళీ అజిత్ నెక్స్ట్ సినిమా అయితే ఇంకా స్టార్ట్ కాలేదు. ఇక అజిత్ లైనప్ పై అయితే లేటెస్ట్ గా మరో ఇంట్రెస్టింగ్ బజ్ ఇప్పుడు వినిపిస్తుంది. అజిత్ కెరీర్ లో వరుసగా పలు డిఫరెంట్ చిత్రాలతో భారీ హిట్స్ ఇచ్చిన దర్శకుడు శివ తో అయితే మరో చిత్రం చేసేందుకు అజిత్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టుగా ఇప్పుడు రూమర్స్ వినిపిస్తున్నాయి. ఇప్పటికే వీరి కాంబో నుంచి వీరమ్, విశ్వాసం, వివేకం సహా పలు భారీ హిట్స్ ఉన్నాయి. దీనితో మరోసారి ఈ సెన్సేషనల్ కాంబినేషన్ రిపీట్ అవుతుంది అంటే దీనిపై మరో స్థాయి అంచనాలు ఉంటాయని చెప్పొచ్చు.. ఇక ఈ ఇంట్రెస్టింగ్ కాంబినేషన్ పై అయితే అధికారిక క్లారిటీ ఇంకా రావాల్సి ఉంది.

# ఆ రామాయణానికి కూడా టెన్షనే?



ఆదిపురుష్ సినిమా విడుదలైనప్పటి నుంచి విమర్శలు వివాదాలు వస్తున్నాయి. శ్రీరాముడిగా ప్రభాస్ సీతగా కృతి సనన్ రావణుడిగా సైఫ్ అలీ ఖాన్ నటించారు. అయితే వీరి పాత్రల ఆహార్యం డైలాగులు విజువల్స్ వంటి పలు అంశాలపై నెటిజన్స్ ట్రోలింగ్ చేస్తున్న సంగతి తెలిసిందే. దర్శకుడు ఓం రౌత్ రామాయణాన్ని తనకు నచ్చినట్లు వక్రీకరించి తెరకెక్కించారని మండి పడుతున్నారు.ఇదిలా ఉంటే... ఈ సినిమా ప్రభావం వచ్చే రామాయణ సినిమాలపై పడే అవకాశం ఉంది. బాలీవుడ్ ఫిలిం మేకర్ నితేశ్ తివారీ రామాయణాన్ని తెరకెక్కించనున్నారని ఇప్పటికే వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఇక ఈయన సినిమాలో రాముడిగా రణబీర్ కపూర్ సీతగా అలియా భట్ ను అనుకున్నారు. అయితే ఇప్పటికే ఆది పురుష్ సినిమా తీవ్ర ట్రోలింగ్ కు గురవుతోంది.ఇప్పుడు మరో రామాయణంపై ఆ సినిమా ప్రభావం పడుతుందనే చెప్పవచ్చు. ఇదిలా ఉంటే రాముడిగా రణబీర్ కపూర్ అనర్హుడు అంటూ సోషల్ మీడియాలో హిందూ వాదులు పెడుతున్నారు. దానికి కారణం.. రణబీర్ కపూర్ ఓ ఇంటర్వ్యూలో తాను బీఫ్ తింటాను అని చెప్పడం... ఇలా బీఫ్ తినే వ్యక్తి రాముడి పాత్రలో నటించేందుకు అనర్హుడు అంటూ ట్రోల్ చేస్తున్నారు.మరోవైపు సీతగా అలీయా భట్ నటించొద్దని అంటున్నారు. దానికి కారణం ఇంతకు ముందు అలియా భట్... గంగూబాయి కతియావాడిలో వేశ్య పాత్ర పోషించింది. ఇలాంటి పాత్రలో నటించిన ఈమెకు సీతగా నటించే అర్హత లేదని హిందూ వాదులు వాపోతున్నారు. అయితే వారు నటులు.. ఏ పాత్రలోనైనా నటించే స్వేచ్ఛ వారికి ఉంటుందని కొంతమంది చెబుతున్నారు.అయితే ప్రాజెక్టు విషయానికి వస్తే... ఇందులో రాముడిగా రణ్ బీర్ సీతగా ఆలియా రావణుడిగా యష్ కన్ఫామ్ అంటున్నారు. ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మాత మధు మంతెనలతో కలిసి ఆయన ఈ ప్రాజెక్ట్ చేస్తున్నారు. డిసెంబర్ లో ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కబోతోందని సమాచారం. అయితే ఆదిపురుష్ ప్రభావం వచ్చే పౌరణిక సినిమాలపై పడనుందని అర్థం అవుతుంది. చూడాలి ఇక.

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
రూపాయి పెట్టుబడి లేకుండా...
భాగస్వాములు అవ్వండి...

భారతదేశంలో ఫోర్త్ ఎస్టేట్ గా పిలవబడే మీడియా, కొన్ని వర్గాలు,కొన్ని పార్టీల చేతిలో కీలుబొమ్మగా ఉన్న విషయం విధితమే. దీని వలన, 3 ఎస్టేట్స్ అయినటువంటి పార్లమెంట్, ఎగ్జిక్యూటివ్, జ్యూడిషరీ వ్యవస్థలోని తప్పిదాలను ప్రపంచానికి తెలియపరచలేకపోతుంది. మరీ ముఖ్యంగా ఈ దేశం బాగుండాలని కోరుకునే OC లలోని అభ్యుదయ వాదులు , బీసీ, ఎస్సీ, ఎస్టీ, క్రిస్టియన్, ముస్లిం,మైనార్టీలు వారి సమస్యలు ప్రభుత్వాలకు తెలియకపోవడం వలన దేశాభివృద్ధిలో బహుజనులు పాలు పంచుకోలేక పోతున్నారు.

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారు చెప్పిన విధంగా
"పక్షికి రెక్కలు లేకపోతే ఎగురలేదు,
బహుజనులకు మీడియా లేకుంటే అభివృద్ధి లేదు"

అని చెప్పిన దాన్ని స్ఫూర్తిగా తీసుకుని ,ప్రజాపాలన తెలుగు దినపత్రిక ను మండలాల వారీగా పెట్టుబడి లేకుండా 60 % - 40% నిష్పత్తిలో పాట్నర్ షిప్ ఇస్తుంది. మీ మీ ప్రాంతం లో 100 లేదా 50 పేపర్లు చొప్పున తీసుకొని పార్ట్నర్‌గా చేరి మీ ప్రాంతంలో పత్రికాధిపతిగా ఆదాయంతో పాటు ఎనలేని గౌరవాన్ని పొందండి.

వివరాలకు ఈ క్రింది నంబర్లలో సంప్రదించండి.
8886022523,9000621111,9948725373

Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed & published at Unyted Publications, From H.no: #50-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16 ANDHRAPRADESH, India.
Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com